నేడు గురుకుల కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

బోథ్, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఈనెల 31న గురువారం ఉదయం 9 గంటలకు ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీలలో మిగిలి ఉన్న సీట్ల కోసం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సంగీత బుధవారం తెలిపారు. ఈ ఏడాది రెగ్యులర్‌గా పాసైన బాలికలు, కుల ధ్రువీకరణ పత్రం పదవ తరగతి ఆన్‌లైన్ మెమో జనన ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఐదు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఒరిజినల్ పత్రాలతో హాజరుకావాలని ప్రిన్సిపాల్ ఈ సందర్భంగా సూచించారు.



- జిల్లా సాధారణ వర్షపాతం 523.1 మి.మీలు, కురిసింది 487.7 మి.మీ.లు
- సోనాల మండలంలో అత్యధిక లోటు వర్షపాతం
- ముసురు వర్షాలతో నిండుకోని ప్రాజెక్టులు, చెరువులు
- వర్షాధార పంటల సాగుకు అనుకూలమైన వాతావరణం
- లోటు వర్షపాతంతో అన్నదాతల ఊగిసలాట

ఆగస్టుపైనే.. ఆశలన్నీ!

వర్షాకాలం ప్రారంభమై..

రెండు నెలలు గడిచి పోతున్నా.. జిల్లాలో ఇంకా లోటు వర్షపాతమే కనిపిస్తోంది. దీంతో అన్నదాతలు ఆగస్టుపైనే భారీ ఆశలు పెట్టుకుంటున్నారు. ఈ యేడు జూన్ 1 నుంచి జూలై 30 వరకు 523.1 మి.మీ.ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. 487.7 మి.మీ.ల లోటు వర్షపాతం నమోదైంది. దీంతో మైనస్ 7.0 మి.మీ.ల లోటు వర్షపాతం నమోదైనట్లు తెలుస్తుంది. ఇదే గతేడు జూలై 30 వరకు 611.3 మి.మీ.ల అధిక వర్షం కురిసింది. ఈసారి ముందస్తు వర్షాలు మురిపించినా.. ఆ తర్వాత ముఖం చాటేయడంతో ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదు కావడం లేదు.

ఆదిలాబాద్, జూలై 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జూన్, జూలై మాసాలలో అడపాదడప కురిసిన వర్షాలకు రైతులు పంటలను సాగు చేశారు. ఇప్పటికే పంటల సాగు పనులు పూర్తయినట్లు అధికారులు పేర్కొంటున్నారు. మెట్ట పంటల సాగుకు అనుకూలమైన వాతావరణం కావడంతో అన్నదాతల్లో హర్షం వ్యక్తమవుతుంది. కానీ ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదు కావడం లేదు. దీంతో భూగర్భజలాల పెరుగుదల కనిపించడం లేదు. ముఖ్యంగా వర్షాధారంగా పండించే పత్తి, సోయా, కంది, మినుము, పెసర, జొన్న, మొక్కజొన్న పంటలు ఆశాజనకంగానే కనిపిస్తున్నాయి. రాష్ట్రంలోనే అత్యధిక వర్షపాతం నమోదయ్యే జిల్లాలో ఇంకా కొన్ని మండలాల్లో లోటు వర్షపాతం నమోదు కావడంపై అన్నదాతలను ఆందోళన రేపుతోంది.

ఇంకా 4 మండలాల్లో లోటే..

వర్షాకాలం సీజన్ ప్రారంభమై రెండు మాసాలు గడిచి పోతున్నా.. ఇంకా నాలుగు మండలాల్లో లోటు వర్షపాతమే కనిపిస్తుంది. జిల్లాలో మొత్తం 21 మండలాలకు గాను 18 మండలాల్లో మాత్రమే సాధారణ వర్షపాతం కురిసింది. ఇచ్చోడ మండలంలో 672.1 మి.మీ.ల అధిక వర్షపాతం నమోదైంది. గాదిగూడ మండలంలో 340.4 వర్షపాతం నమోదు కాగా, మైనస్ 33.0 మి.మీ.ల లోటు అలాగే బోథ్ మండలంలో 327.9 మి.మీ.ల వర్షం కురవగా.. మైనస్ 36.0, నేరడిగొండ మండలంలో 302.4 మి.మీ.ల వర్షం కురవగా.. మైనస్ 41.0, సోనాల మండలంలో కేవలం 288.1 మి.మీ.ల వర్షపాతం నమోదుకాగా మైనస్ 44.0 మి.మీ.ల అధిక లోటు వర్షపాతం నమోదైంది. జిల్లాలోనే భిన్నమైన వాతావరణ పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఓ మండలంలో కురిసిన వర్షపాతం మరో మండలంలో కురవక పోవడంతో వర్షపాతం నమోదులో భారీ తేడా కనిపిస్తోంది.

కనీస స్థాయి ఇన్‌ఫ్లో..

ముసురు వర్షాలతో ప్రాజెక్టులు, చెరువులు, కుంటల్లోకి ఆశించిన స్థాయిలో ఇన్‌ఫ్లో రాక పోవడంతో నీటి నిల్వలు నామమాత్రంగానే కనిపిస్తున్నాయి. జిల్లాలో ప్రధానంగా చెప్పుకునే సాత్నాల, మత్తడివాగు ప్రాజెక్టులు ప్రధాన చెరువులు, కుంటలు ఇంకా నిండుకుండను తలపించడం లేదు. జూలై 30 వరకు సాత్నాల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 286.50 మీటర్లు కాగా, ప్రస్తుతం 285.55 మీటర్లకు చేరుకుంది. అలాగే మత్తడివాగు పూర్తిస్థాయి నీటిమట్టం 277.50 మీటర్లు కాగా, ప్రస్తుతం 277.05 మీటర్లకు చేరింది. ఈ రెండు ప్రాజెక్టుల్లోకి కనీస స్థాయిలోనే ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. అలాగే చెరువులు, కుంటలు నిండక పోవడంతో

(తరువాయి 6వ పేజీలో....)

జూలై 30 వరకు కురిసిన వర్షపాతం వివరాలిలా..

- జిల్లా సాధారణ వర్షపాతం : 523.1 మి.మీ.లు
- కురిసిన వర్షపాతం : 487.7 మి.మీ.లు
- జిల్లా లోటు వర్షపాతం : -7.0 మి.మీ.లు
- గత ఏడాది జూలై 30 వరకు కురిసిన వర్షపాతం : 611.3 మి.మీ.లు
- లోటు వర్షపాతం నమోదైన మండలాలివే..

గాదిగూడ	: 340.4 మి.మీ.లు
బోథ్	: 327.9 మి.మీ.లు
నేరడిగొండ	: 302.4 మి.మీ.లు
సోనాల	: 288.1 మి.మీ.లు

- అత్యధిక వర్షపాతం నమోదైన మండలం

ఇచ్చోడ	: 672.1 మి.మీ.లు



జిల్లాకేంద్రంలో కురుస్తున్న వర్షం(ఫైల్)

ఫటాఫట్



కులాంతర వివాహాలకు పారితోషకాలు

: రాజలింగం, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి

ప్రశ్న: కులాంతర వివాహాలను ప్రభుత్వం ఏ విధంగా ప్రోత్సహిస్తోంది?

జవాబు: కులాంతర వివాహాలు చేసుకున్న జంటలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పారితోషకాన్ని అందిస్తుంది. 2024-25లో ఏడు జంటలు పారితోషకం కోసం దరఖాస్తు చేసుకున్నాయి. ప్రభుత్వం నిధులను విడుదల చేయగానే వీరికి అందజేస్తాం.

ప్ర: రాజీవ్ యువవికాసం పథకానికి ఎంత మంది దరఖాస్తులు చేసుకున్నారు?

జ: బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రాజీవ్ యువ వికాసం పథకానికి 19,100 మంది దరఖాస్తు చేసుకున్నారు. అలాగే ఈడబ్ల్యుఎస్ నుంచి 724 దరఖాస్తులు వచ్చాయి.

ప్ర: జిల్లాలో ఎన్ని ప్రీ మెట్రిక్, పోస్టు మెట్రిక్ వసతి గృహాలు ఉన్నాయి?

జ: జిల్లాలో 7 ప్రీ మెట్రిక్, మరో 7 పోస్టుమెట్రిక్ వసతి గృహాలు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం 1196 మంది విద్యార్థులు ఉన్నారు.

ప్ర: బీసీ స్టడి సర్కిల్ ద్వారా నిరుద్యోగులకు ఉచిత శిక్షణ అందిస్తున్నారా?

జ: గత కొన్నేళ్లుగా బీసీ స్టడీ సర్కిల్ ద్వారా నిరుద్యోగులకు ఉచితంగా వసతి, శిక్షణను కల్పిస్తున్నాం. 2024-25 ఏడాదిలో గ్రూప్-1, ఫౌండేషన్ కోర్సులకు గాను వంద మందికి 4 నెలల పాటు శిక్షణ ఇవ్వడం జరిగింది. వీరికి రూ.7లక్షల 81వేల 971 నిధులను ఖర్చు చేయడం జరిగింది. అలాగే ఉచితంగానే పోటీ పరీక్షలకు అవసరమైన మెటీరియల్‌ను అందజేస్తున్నాం.

ప్ర: బీసీ న్యాయవాదులకు సంబంధించిన ఉపకార వేతనాలు ఇస్తున్నారా?

జ: బీసీ న్యాయవాదులకు ఉపకార వేతనాలను ఇస్తున్నాం. 2024-25 సంవత్సరానికి గాను రూ.4లక్షల 67వేలు నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. దీంతో 16మంది న్యాయవాదులకు స్టైఫండ్‌ను అందజేయడం జరిగింది.

- ఆదిలాబాద్, ఆంధ్రజ్యోతి



ఇచ్చోడ పీహెచ్‌సీలో సమస్యలపై చర్చిస్తున్న జిల్లా అధికారి

నాణ్యమైన వైద్య సేవలందించాలి

- జిల్లా వైద్యాధికారి నరేందర్

ఇచ్చోడ, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతమైన ఇచ్చోడ మండలంలోని నిరుపేదలకు, గిరిజనులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి డా.నరేందర్ ఆదేశించారు. ఇచ్చోడ పీహెచ్‌సీని బుధవారం ఆకస్మికంగా తనఖీ చేసి పలు వార్డులు, రికార్డులను పరిశీలించారు. రోగులతో ముచ్చటించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసకున్నారు. వైద్యులు, సిబ్బంది అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. గర్భిణులు ఆసుపత్రిలో చేరిన దగ్గరినుంచి సురక్షితమైన కాన్పు అయి ఇంటికి వెళ్లే వరకు ప్రత్యేక పర్యవేక్షణ ఉంచాలని సూచించారు. వివిధ రకాల జబ్బులకు సంబంధించి వైద్యం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యుడు కిరణ్ కుమార్, వైద్యసిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అంధ్ ఆదివాసీ గ్రామాల్లో శిరాళ్ ఉత్సవాలు

ఇంద్రవెల్లి, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలో అంధ్ ఆదివాసీ గ్రామాల్లో శ్రావణ మాసంలో నాగుల పంచమి పండుగ మరుసటి రోజున నిర్వహించే శిరాళ్ ఉత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని అంజి, హర్కపూర్, అంద్‌గూడ, మామిడిగూడ, అంధ్‌గూడ తదితర గ్రామాల్లో తమతమ గ్రామాల పోలిమేరలో గల పుట్ట మట్టిని గ్రామ పెద్ద ఇంటికి తీసుకొచ్చి శిరాళ్ దేవతల విగ్రహాలను తయారు చేసి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు సమర్పించారు. పంటలు బాగా పండాలని మొక్కినట్లు అంధ్ ఆదివాసీ పెద్దలు తెలిపారు. అనంతరం శిరాల్ విగ్రహాలను గ్రా మాల్లో ఊరేగిస్తూ మహిళలు చేసిన సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. రాత్రి ప్రత్యేక పూజలతో గ్రామ పొలిమేరలో గల వాగుల్లో వదిలి విడిది చేశారు. ఇందులో ముఖడే సంగీత, బందుకే కవితాబాయి, డగ్గే గీతాబాయి, ఆరులే కుసుంబాయి, గంగాబాయి, తులసి బాయి, గోధులే జనబాయి, తదితరులు ఉన్నారు.



అంజి గ్రామంలో సంప్రదాయ నృత్యాలు చేస్తున్న అంద్ ఆదివాసీ మహిళలు

స్థానిక ఉత్పత్తులకు ప్రోత్సాహం అందించాలి

- ఆకాంక్ష హాట్ స్టాళ్లను ప్రారంభించిన కలెక్టర్ రాజర్షి షా
- ఇచ్చోడ, బోథ్‌లలో లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డుల పంపిణీ

ఆదిలాబాద్ టౌన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలు స్థానిక ఉత్పత్తులను ఆదరిస్తూ ప్రోత్సహించాలని కలెక్టర్ రాజర్షి షా సూచించారు. నీతి అయోగ్ మార్గదర్శకత్వంలో వోకల్ ఫర్ లోకల్ ఆత్మను ప్రోత్సహించే ఆకాంక్ష హాట్ ప్రదర్శన స్టాళ్లను బుధవారం స్థానిన టీటీడీ కల్యాణ మండపంలో కలెక్టర్ ప్రారంభించారు. ప్రదర్శనలో 24 స్టాళ్లను ఏర్పటు చేయగా.. వాటి వివరాలను అడిగి తెలుసుకుని నిర్వాహకులకు అవసరమైన సూచనలు చేశారు. వివిధ మం డలాల నుంచి వచ్చిన మహిళా స్వయంసహాయ సం ఘాలు, కళాకారులు, గిరిజన పారిశ్రామికవేత్తలు స్టాళ్లను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. గిరిజన సంప్రదాయ తినుబండారాలు, ఔషధ గుణాల కలిగిన ఉత్పత్తులు, చేతితో త యారు చేసిన వస్త్రాలు, ఆర్గానిక్ పంటలు, సాంస్కృతిక అలంకరణ వస్తువులు ప్రదర్శనలో ఉన్నాయని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇందులో జడ్పీ సీఈవో జితేందర్ రెడ్డి, డీఆర్‌డీవో రవీందర్ రాథోడ్, డీవైఎస్‌ఓ జక్కుల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



- స్టాళ్ల నిర్వాహకులతో మాట్లాడుతున్న కలెక్టర్

అర్హులందరికీ రేషన్‌కార్డులు

ఇచ్చోడ: రేషన్‌కార్డులు రాలేదని ఎవరూ నిరాశ చెందవద్దని అర్హులందరికీ రేషన్‌కార్డులు మంజూరు అవుతాయని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో నిర్వహించిన ఇచ్చోడ, సిరికొండ మండలాల లబ్ధిదారులకు ఆహార భద్రత కార్డుల పంపిణీలో ఆయన ప్రసంగించారు. రేషన్ కార్డులు రానివారు తిరిగి మళ్లీ దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాటాడుతూ.. రేషన్ కార్డులు ప్రతిఒక్కరికీ వస్తాయని, రేషన్ బియ్యాన్ని ఎవ్వరూ అమ్ముకోవద్దని అన్నారు. అలా చేస్తే మీ రేషన్ కార్డు రద్దు అవుతుందని ప్రజలు గమనించాలని ఆయన కోరారు. అనంతరం లబ్ధిదారులకు రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామల, ఆర్డీవో స్రవంతి, జిల్లా గ్రంథాలయా చైర్మెన్ మల్లెపూల నర్సయ్య, మాజీ ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, తహసీల్దార్లు సత్యనారాయణ, తుకారాం, అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పథకాలలో దళారీ వ్యవస్థ ఉంటే చర్యలు

బోథ్: ప్రభుత్వం అందిస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలలో మధ్య దళారీ వ్యవస్థ ఉండకూడదని ఒకవేళ దళారీ వ్యవస్థ ఉంటే చర్యలు తప్పకుండా తీసుకుంటామని కలెక్టర్ రాజర్షిషా పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో అర్హులైన లబ్ధిదారులకు రేషన్ కార్డులకు సంబంధించిన పత్రాలను పంపిణీ చేశారు. అంతేగాక రేషన్ బియ్యం అమ్ముకోకూడదని ఆ బియ్యంలో అవసరమైన ప్రోటీన్స్ ఉంటాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు. రేషన్ బియ్యం తింటే రక్తహీనత ఉండకుండా ఉంటుందన్నారు. రక్తహీనత నుంచి ప్రతీఒక్కరు కాపాడుకోవాలన్నారు. అంతేకాకుండా ఆర్ఎంపీల వైద్యం వల్ల గ్రామాల్లో అనేక మందికి కిడ్నీ సంబంధిత వ్యాధులు వస్తున్నాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శ్యామల దేవి, ఎమ్మెల్యే జాదవ్ అనిల్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నరసయ్య, ఆత్మ చైర్మన్ జి. రాజు యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డితో పాటు బోథ్, నేరడిగొండ, సోనాల తహసీల్దార్‌లు సుభాష్ చంద్ర, ఎంఎ కలీం, ఇమ్రాన్ ఖాన్‌లతో పాటు డీఎస్‌ఓ పలువురు అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి ఆర్డీఓ స్రవంతి అధ్యక్షత వహించగా పలు గ్రామాల లబ్దిదారులు పాల్గొన్నారు.



ఇచ్చోడలో రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న బోథ్ ఎమ్మెల్యే, కలెక్టర్



బోథ్‌లో పాల్గొన్న లబ్ధిదారులు, మహిళలు

రిమ్స్‌లో వైద్య విద్యార్థి ఆత్మహత్య

- గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకున్న విద్యార్థి
- విద్యార్థి స్వస్థలం రాజస్థాన్ రాష్ట్రం జైపూర్ పట్టణం

ఆదిలాబాద్, జూలై 30(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని రిమ్స్ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సెకండీయర్ చదువుతున్న వైద్య విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. రాజస్థాన్ రాష్ట్రం జైపూర్ పట్టణానికి చెందిన సాహిల్ చౌదరి(20) తన గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడడం వైద్యకళాశాలలో కలకలం రేపింది. చదువులో చురుకైన విద్యార్థిగా పేరున్న సాహిల్ ఆత్మహత్యకు పాల్పడడంతో తోటి విద్యార్థులు, అధ్యాపకులు ఆందోళనకు గురయ్యారు. బుధవారం ఉదయం తోటి విద్యార్థులతో కలిసి టిఫిన్ చేసిన అనంతరం క్లాస్ రూమ్‌కు వెళ్లే సమయంలో అకస్మాత్తుగా హాస్టల్ గదిలోని తన రూమ్‌కు వెళ్లి ఉరివేసుకున్నాడు. దీనిని గమనించిన తోటి విద్యార్థులు డోర్‌ను పగులగొట్టి బయటకు తీసుకువచ్చారు. వెంటనే ఎంఐసీకి తరలించి సీపీఆర్ చేసిన ఫలితం లేకుండా పోయింది. విషయం తెలుసుకున్న రిమ్స్ డైరెక్టర్ రాథోడ్‌జైసింగ్ హుటాహుటిన విద్యార్థి హాస్టల్ గదికి చేరుకుని పరిశీలించారు. ఆ వెంటనే టూటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ కరుణాకర్‌రావు విద్యార్థి ఆత్మహత్యకు గల కారణాలపై విచారణ చేపట్టి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చూరికి తరలించారు. ఈ ఘటనపై త్రిమేన్ కమిటీతో పాటు అంతర్గత విచారణ జరిపిస్తామని రిమ్స్ డైరెక్టర్ తెలిపారు. చదువుల్లో చురుకుగా ఉండే విద్యార్థి హఠాత్తుగా ఆత్మహత్యకు పాల్పడడం విస్మయంగా ఉందని అన్నారు. విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం అందించినట్లు తెలిపారు. సాహిల్ సెల్‌ఫోన్ కాల్స్ ఆధారంగా ఆత్మహత్యకు గల కారణాలపై పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారని వివరించారు.



సాహిల్ చౌదరి(ఫైల్)

వైద్య విద్యార్థి మృతి పట్ల ఎమ్మెల్యే దిగ్భ్రాంతి

ఆదిలాబాద్ టౌన్: వైద్య విద్యార్థి సాహిల్ చౌదరి ఆత్మహత్య చేసుకుని మృతి చెందడం పట్ల ఎమ్మెల్యే పాయల్ శంకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రిమ్స్ మార్చురీలో మృతదేహాన్ని పరిశీలించి.. తోటి విద్యార్థులతో మాట్లాడారు. ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబ సభ్యులు రాజస్థాన్ నుంచి బయలదేరి ఆదిలాబాద్‌కు వస్తున్నారని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు. భౌతికకాయాన్ని రాజస్థాన్‌కు పంపే విధంగా జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తుందన్నారు. అదేవిధంగా వసతి గృహంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు.



నాగోబా ఆలయ హుండీ ఆదాయం లెక్కిస్తున్న మెస్రం వంశీయులు

నాగోబా ఆలయ హుండీ లెక్కింపు

ఇంద్రవెల్లి, జూలై 30(ఆంధ్రజ్యోతి): నాగుల పంచమి పండుగ సందర్భంగా ఆదివాసీల ఆరాధ్య దైవం, రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన కేస్లాపూర్ నాగోబా మినీ జాతర ముగిసింది. నాగుల పంచమి పండుగ ఈ సందర్భంగా నాగోబా ఆలయానికి వచ్చిన హుండీ లెక్కింపును మెస్రం వంశీయులు ఆధ్వర్యంలో బుధవారం లెక్కించారు. ఈ హుండీ లెక్కింపును ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావు పటేల్ ప్రారంభించారు. కానుకల రూపంలో రూ.లక్ష ఆదాయం వచ్చిందని తెలిపారు. వెండి 250 గ్రాములు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెస్రం చిన్ను పటేల్, కటోడ మెస్రం కోసేరావు, మెస్రం దేవ్‌రావు, ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం ఆనంద్‌రావు, మాజీ సర్పంచ్ మెస్రం నాగనాథ్, ఆలయ పూజారీ మెస్రం షేకు, తదితరులు పాల్గొన్నారు.

నేడు కొత్త రేషన్ కార్డుల పంపిణీ

ఇంద్రవెల్లి, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కాగ్నే ఫంక్షన్ హాల్‌లో గురువారం ఉదయం 11 గంటలకు కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, కలెక్టర్ రాజర్షి షా, ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మార్మాట్ ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారని తెలిపారు. కొత్త రేషన్ కార్డు మంజూరైన లబ్ధిదారులు తప్పక హాజరు కావాలని పేర్కొన్నారు.

కాంగ్రెస్‌లో ప్రతీ ఇంటికి సంక్షేమ పథకం

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల

బోథ్, జూలై 30(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా పాలన కొనసాగుతోందని, ప్రజా ప్రభుత్వం హయాంలో ప్రతీ ఇంటికి కాంగ్రెస్ పార్టీ చేపట్టిన సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నరసయ్య పేర్కొన్నారు. బుధవారం బోథ్‌కు వచ్చిన సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం సంక్షేమ పథకాలను చేపట్టకపోగా.. ప్రజలను అన్ని విధాలుగా మోసం చేసి ప్రజాధనం లూటి చేసిందన్నారు. గతంలో ఎప్పుడూ లేనివిధంగా ప్రజల అవసరాలు తీర్చే విధంగా సిసి రోడ్ల నిర్మాణం, పొలం బాటలు, బీటీ రోడ్లు, ఆదివాసులకు పోడు భూముల్లో సోలార్ మోటార్ల పంపుసెట్లు, ఉచిత బస్సు ప్రయాణం, నూతన రేషన్ కార్డులు, భూభారతి వంటి పథకాలను అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వానిదే అన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఏమీ చేయకుండా.. చేసినట్టుగా తప్పుడు ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. ఇందులో మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, బోథ్ బ్లాక్ ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్, కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు బద్దం పోతారెడ్డి, ప్రజారత్నం, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జల్కే పాండురంగ, తదితరులు పాల్గొన్నారు.



బోథ్‌లో మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్

ఎరువుల విక్రయాలపై నజర్

- పక్కదారి పట్టకుండా ప్రత్యేక నిఘా
- బ్లాక్ మార్కెట్‌కు తరలకుండా తనిఖీలు
- అధిక ధరలకు విక్రయించకుండా చర్యలు
- విక్రయ కేంద్రాల వద్ద స్టాక్ బోర్డుల ఏర్పాటుకు ఆదేశాలు

భైంసా, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఎరువుల సరఫరా, విక్రయాలపై నెలకొంటున్న సందిగ్ధ పరిస్థితులను పరిష్కరించేందు వ్యవసాయాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఎరువుల కొరత ఏర్పడకుండా సమృద్ధిగా సరఫరా అయ్యే దిశగా చర్యలను ముమ్మరం చేశారు. కలెక్టర్ అభిలాష అభినవ్ సారథ్యంలో జిల్లా వ్యవసాయాధికారి అంజీ ప్రసాద్ ఎరువుల సరఫరా, విక్రయాల ప్రక్రియలో సమస్యలు ఏర్పడకుండా ముందస్తు చర్యలను వేగవంతం చేశారు. ఇదే క్రమంలో ఎరువులు పక్కదారి పట్టకుండా నిఘా వ్యవస్థను పటిష్ఠం చేశారు. అధిక ధరలకు విక్రయాలు జరుగకుండా పకడ్బందీ చర్యలకు ఉపక్రమించారు. ఇందుకోసంగాను జిల్లా వ్యాప్తంగా ఆయా మండల పరిధిలోని వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటనలు చేస్తూ ఎరువుల విక్రయాలపై నిరంతర పర్యవేక్షణ, తనిఖీలు చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. అంతేకాకుండా ప్రతి విక్రయ కేంద్రంలో డీలర్లు తప్పనిసరిగా బోర్డులను ఏర్పాటు చేసి వాటిపై ఎరువుల ధరలతో పాటు నిల్వల వివరాలను స్పష్టంగా పొందుపరచాలని ఆదేశాలు జారీ చేశారు.

కొరత లేదు..

వ్యవసాయ శాఖాధికారుల లెక్కల ప్రకారం జిల్లాలో యూరియ నిల్వలు సమృద్ధిగా ఉన్నాయి. జిల్లాలోని 18 మండలాల్లోని ఎరువుల విక్రయ కేంద్రాల్లో మొత్తం 2,577.981 మెట్రిక్ టన్నుల యూరియ నిల్వలు అందుబాటులో ఉన్నాయి. సారంగపూర్ మండలంలో 380.69 మెట్రిక్ టన్నులు, లోకేశ్వరం మండలంలో 375.44 మెట్రిక్ టన్నులు నర్సాపూర్(జి) మండలంలో 299.14 మెట్రిక్ టన్నులు, లక్ష్మణ్‌చాంద మండలంలో 220.365 మెట్రిక్ టన్నులు, భైంసా పట్టణం, మండల పరిధిలో 194.513 మెట్రిక్ టన్నులు, సోన్ మండలంలో 150.615 మెట్రిక్ టన్నులు ,దస్తూరబాద్ మండలంలో 89.235 మెట్రిక్ టన్నులు, దిలావర్‌పూర్ మండలంలో 119.07 మెట్రిక్ టన్నులు, కడం మండలంలో 73.755 మెట్రిక్ టన్నులు, ఖానాపూర్ మండలంలో 117.63 మెట్రిక్ టన్నులు, కుభీర్ మండలంలో 66.15 మెట్రిక్ టన్నులు, కుంటాల మండలంలో 124.373 మెట్రిక్ టన్నులు, మామడ మండలంలో 75.195 మెట్రిక్ టన్నులు, ముథోల్ మండలంలో 56.43 మెట్రిక్ టన్నులు, నిర్మల్ అర్బన్ పరిధిలో 67.41 మెట్రిక్ టన్నులు, నిర్మల్ రూరల్ పరిధిలో 126.72 మెట్రిక్ టన్నులు, పెంబి మండలంలో 29.7 మెట్రిక్ టన్నులు, తానూర్ మండలంలో 11.55 మెట్రిక్ టన్నులు యూరియ నిల్వలు అందుబాటులో ఉన్నాయి.

22 వేల మెట్రిక్ టన్నుల సరఫరా

జిల్లాలో ప్రస్తుత వానకాలపు సీజన్‌లో అన్నదాతలు 4.31 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలను సాగు చేస్తున్నారు. వీటి కోసం గాను జూన్ నుంచి సెప్టెంబరు మాసం వరకు మొత్తం 35వేల మెట్రిక్ టన్నుల యూరియ అవసరం కానుందని వ్యవసాయాధికారులు అంచనా వేశారు. ఇక 10 వేల మెట్రిక్ టన్నుల డీఏపీ అవశ్యకతగా వ్యవసాయాధికారులు ప్రతిపాదించారు. ఇందులో జిల్లాకు ఇప్పటి వరకు 9 వేల మెట్రిక్ టన్నుల డీఏపీ నిల్వలు సరఫరా అవ్వగా మరో వేయి మెట్రిక్ టన్నుల ఇంకా అవసరముంది. యూరియ విషయానికి వస్తే ఇప్పటి వరకు జిల్లాకు 22 వేల మెట్రిక్ టన్నుల సరఫరా అయ్యింది.ఇక మిగతా 13 వేల మెట్రిక్ టన్నులలో ఆగస్టు మాసంలో 8 వేల మెట్రిక్ టన్నులు, సెప్టెంబర్ మాసంలో 5 వేల మెట్రిక్ టన్నులు యూరియ సరఫరా కానుందని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.

నానో యూరియా వినియోగించాలి

అన్ని విధాలుగా అధిక ప్రయోజనకరంగా ఉండే నానో యూరియా వినియోగంపై రైతులు దృష్టి సారించాలి. తక్కువ వ్యయంతో అధిక దిగుబడులకు తోడ్పాటునిచ్చే నానో యూరియా వినియోగంతో లాభాలు ఎక్కువగా ఉంటాయి. పర్యావరణహితంతో పాటు పంటలకు అధిక సామర్థ్యం చేకూరనుంది. ద్రవరూపంలో ఉండే నానో యూరియా పిచికారి సైతం సులభమైన రీతిలో చేపట్టవచ్చు. రైతులు తాము సాగు చేస్తున్న పంటలలో కొద్దిమేరనైనా ప్రయోగాత్మకంగా నానో యూరియా వాడకం చేపట్టాలి.

-అంజీ ప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి, నిర్మల్



భైంసాలోని ఒక విక్రయ కేంద్రంలో ఎరువుల నిల్వలు



ఎరువుల నిల్వలను తనిఖీ చేస్తున్న ఏడీఏ వీణా, ఏవో రవి



ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో కురుస్తున్న వర్షం(ఫైల్)

ఆగస్టుపైనే.. ఆశలన్నీ!

(5వ పేజీ తరువాయి...)

ఆయకట్టు రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. సగం సీజన్ ముగిసినా.. పెద్దగా వర్షాలు కురవడం లేదంటూ అన్నదాతలు చెబుతున్నారు.

మెట్ట పంటలకు అనుకూలమే..

జిల్లాలో కురుస్తున్న వర్షాలు వర్షాధార పంటలకు అనుకూలంగా మారాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గత వారం రోజులుగా కురుస్తున్న ముసురు వర్షాలకు మెట్ట పంటలు ఏపుగా పెరిగి కనిపిస్తున్నాయి. నల్లరేగడి నేలల్లోని లోతట్టు పంటలు జౌకుబట్టి పోతుండగా.. చలకలు ఎత్తు ప్రదేశాల్లోనే పంటలు ఆశాజనకంగానే కనిపిస్తున్నాయని అన్నదాతలు పేర్కొంటున్నారు. ముసురు వర్షాలతో కలుపు నివారణ కష్టమవుతుందని చెబుతున్నారు. అలాగే రోజుల తరబడి పత్తి పంటకు రసాయన మందుల పిచికారికి అవకాశమే లేక పోవడంతో చీడపీడలు ఆశించే ప్రమాదం ఉందని రైతులు పేర్కొంటున్నారు. ఆగస్టు మాసంలోనైనా అధిక వర్షాలు కురిస్తేనే వర్షాకాల పంటల సీజన్‌ను గట్టెక్కె అవకాశం ఉందంటున్నారు. లేకపోతే ఆశించిన స్థాయిలో పంటల దిగుబడి ఉండదని రెండవ పంట సాగుకు అవకాశమే లేకుండా పోతుందని రైతులు వాపోతున్నారు.

హత్యాయత్నం కేసులో ఒకరికి ఏడాది జైలు

ఆదిలాబాద్ టౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : హత్యాయత్నం కేసులో నిందితుడికి సంవత్సరం జైలు శిక్ష, రూ.5000 జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.ప్రభాకర్ రావు బుధవారం తీర్పు వెలువరించారు. కోర్టు లైసెన్ అధికారి ఎం.గంగా సింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. గుడిహత్నూర్ మండలం మన్నూరు గ్రామానికి చెందిన ముర్కుటే సాయినాథ్, షిండే ముకుంద్‌కు తరచుగా ఇంటి స్థలం విషయంలో గొడవలు జరుగుతూ ఉండేవి. ఇదే క్రమంలో 2023వ ఏడాది సెప్టెంబర్ ఏడవ తేదీన ఇంటి స్థలం గురించి మాట్లాడుతుండగా నిందితుడు ముర్కుటే సాయినాథ్ బాధితుడు షిండే ముకుంద్‌ను చంపాలనే ఉద్దేశంతో తల వెనక భాగంలో కొడవలితో కొట్టాడు. తీవ్ర గాయాలతో ఆయనను ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై ఫిర్యాదుదారుడు సిందే రాహుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై ఇమ్రాన్ కేసు నమోదు చేసి చార్జ్ షీట్ దాఖలు చేశారు. కోర్టు డ్యూటీ అధికారి రవీందర్ రెడ్డి పదిమంది సాక్షులను కోర్టులో హాజరుపరచగా... పీపీ రహీం కేసును వాదించారు. ఈమేరకు నిందితుడికి ఒక సంవత్సరం జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. నిందితులకు శిక్ష పడటంలో కీలకపాత్ర పోషించిన పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అభినందించారు.

భర్త మందలించాడని భార్య ఆత్మహత్య

భైంసా రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : మండంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ప్రియాంక(23) భర్త మందలించాడని ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ప్రియాంక తరచూ ఫోన్‌లో మాట్లాడటాన్ని గమనించిన భర్త ముత్తన్న రోజంతా ఫోన్‌లో మాట్లాడటం మానుకోవాలని భార్యను మందలించాడు. ఈ విషయమై ఇద్దరి మధ్య గొడవలు జరిగేవి. ఫోన్ విషయంలో మంగళవారం రాత్రి కూడా గొడవ జరగడంతో మనస్తాపానికి గురైన ప్రియాంక ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలికి సంవత్సరన్నర కొడుకు, ఆరు నెలల పాప ఉంది. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

పొన్నారిలో దొంగల హల్‌చల్

తాంసి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో దొంగల హల్ చల్.. మళ్ళీ మొదలైంది. మంగళవారం నడిరాత్రి మండలంలోని పొన్నారి గ్రామంలో ముగ్గురు దొంగలు హల్‌చల్ చేశారు. ఈసంఘటనతో ఉలిక్కిపడ్డ గ్రామస్తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అర్థరాత్రి గుర్తుతెలియని ముగ్గురుదుండగులు చోరీకిపాల్పడ్డారు.దేవేల్లఉషన్న అనేవ్యక్తి ఇంట్లో చొర బడేందుకు ముందుగా ప్రయత్నించారు. కానీ అవకా శం రాక పోవడంతో పక్కనే ఉన్న తొడసం అనిల్ ఇంట్లోకి చొరబడి వారు చూస్తూ ఉండగానే కత్తులు చూపించి రెండు సెల్ ఫోన్లు నాలుగు వేల నగదును అపహరించారని బాధితులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు నడి రాత్రిదొంగల కోసం గాలింపు ముమ్మరం చేశారు. ఈ విషయంపై పోలీసులు గ్రామానికి చేరుకొని వివరాలను సేకరిస్తున్నారు.

ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య

భైంసా రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వట్టోలి గ్రామానికి చెందిన బి. మహేష్(37) అనే వ్యక్తి ఉరి వేసుకొని మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బి. మహేష్ కూలీ పని చేస్తూ జీవిస్తుండేవాడు. గత కొన్ని రోజుల నుండి మద్యానికి బానిసై ప్రతిరోజు మద్యం తాగుతుండేవాడు. ఇంట్లో వాళ్లు ఎంత చెప్పినా మద్యం తాగడం మానుకోలేకపోయాడు. మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో జీవితం మీద విరక్తి చెంది ఇంటి దూలాలకు అడ్డంగా కట్టిన డ్రిప్ పైప్‌లకు పోడువాటి టవల్‌తో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య రజిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై ఆర్. శంకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు.

మానవ అక్రమ రవాణా పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఆదిలాబాద్ టౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా మెలగాలని డీసీపీవో రాజేంద్ర ప్రసాద్, సీఐ పద్మ తెలిపారు. పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో బుధవారం ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ష్యూర్ ఎన్‌జీఓ ఆధ్వర్యంలో అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు.కార్యక్రమంలో రైల్వే స్టేషన్ మాస్టర్ శియరాం, ఆర్పీఎఫ్ ఎస్సై వినోద్ పాటిల్, మిషన్ శక్తి కో ఆర్డినేటర్ యశోద్, చైల్డ్ లెన్ కో ఆర్డినేటర్ సతీష్, ష్యూర్ ఎన్‌జీఓ జిల్లా కో ఆర్డినేటర్ కిల్లారే వినోద్, సిబ్బంది కిరణ్, సౌజన్య, కృష్ణవేణి, శ్రీకాంత్, రాకేశ్ పాల్గొన్నారు.

ఆగస్టు 15 లోపు ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

- పీఆర్‌టీయూటీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీవీ రమణారావు

కడెం, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆగస్టు 15వ తేదీ లోపు పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బీవీ రమణారావు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం కడెం మండలంలోని లింగాపూర్, కడెం ఉన్నత పాఠశాలలో సంఘ సభ్యత్వాన్ని చేపట్టి ఆయా పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతూ... ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం సంఘం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆగస్టు 15 లోపు పరిష్కరించుకుంటే సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ కడెం మండల అధ్యక్షులు బి. వెంకట రమణ, ప్రధాన కార్యదర్శి మహేష్, రాష్ట్ర జిల్లా బాధ్యులు వాల్గోట్ కిషన్,ప్రభాకర్, శ్రీనివాస్, పుండలిక్, ప్రవీణ్, ఉపాధ్యాయులు మెరుగు శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన వనం ఆధ్వర్యంలో అవగాహన

ముథోల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ముథోల్ మండలంలోని బ్రహ్మాన్‌గావ్ రైతు వేదికలో ఉద్యాన శాఖ, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారి సాయినాథ్, ముథోల్ క్లస్టర్ ఆఫీసర్ మోహిని మియా, మాజీ సర్పంచ్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విధానాలతో రాష్ట్రం అప్పుల పాలు

- ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్ టౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : పదేళ్ల పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం, సుమారు రెండు ఏళ్లుగా పాలన సాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాల విధానాలతో తెలంగాణ రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులతోనే గ్రామాల్లో అభివృద్ధి పనులు సాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. బుధవారం సాత్నాల మండలం జామిని గ్రామ మాజీ ఎంపీటీసీ రేణుక బాయితోపాటు పలువురు ఎమ్మెల్యే సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలను కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. ఈ మేరకు ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఆవాస్ యోజన పథకం, గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో ఇండ్ల నిర్మాణాలు, సీసీ రోడ్లు, స్మశాన వాటికల నిర్మాణాలు సైతం జరుగుతున్నాయని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు పేదలకు చేరడమే బీజేపీ లక్ష్యమని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ బలపర్చే అభ్యర్థులను గెలిపించి, పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పోతరాజు, రమేష్ మహేందర్, రోహిదాస్, దినేష్, దాదారావు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: మారుమూల గ్రామీణ ప్రాంతాల మౌళిక సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక దృష్టి సారించి కృషి చేస్తున్నామని, నియోజక వర్గాన్ని అభివృద్ధి పరచడమే తనముందున్న లక్ష్యంఅని ఆదిలాబాద్ శాసనసభ్యులు పాయలశంకర్ అన్నారు. బుధవారం ఆదిలాబాద్‌రూరల్ మండలం దిమ్మ గ్రామంలో రూ.7లక్షల వ్యయంతో రహదారి నిర్మాణ పనులకు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. దిమ్మ గ్రామాన్ని గత పాలకులు పట్టించుకోలేదని,తమ గ్రామ సమస్యల పరిష్కారం చూపాలని ఎమ్మెల్యేకు విన్నవించారు.సమస్యల పరిష్కారానికి చర్యలు తీసకుంటానని ఎమ్మెల్యే పాయలశంకర్ హామీ ఇచ్చారు. సామాన్య కుటుంబం నుంచి వచ్చిన తనకు అందరి సమస్యలుతెలుసని అన్నారు. తాను చేస్తున్న అభివృద్ధి పనులను ఓర్వలేక రాజకీయ నిందలు మోపుతున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు భూమన్న, నరేష్‌రెడ్డి, రమణ, అశోక్‌రెడ్డి, రత్నాకర్‌రెడ్డి, మయూర్‌చంద్ర, గ్రామస్థులు శ్రీనివాస్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, పసుపుల రాజు, తదితరులు పాల్గొన్నారు.

జైనథ్: సమాజంలో వివిధ కార్యాలయాల్లో అంకిత భావంతో పని చేసినప్పుడే ప్రభుత్వ ఉద్యోగికి గుర్తింపు లభిస్తుందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయలశంకర్ అన్నారు. బుధవారం జైనథ్ మండలంలోని ఆడ గ్రామంలో ఆడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు జయరాం పదవి విరమణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు ఎం.గోవర్ధన్, తుల శ్రీనివాస్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు కొమ్ము‌కృష్ణకుమార్,పీఆర్టీయూ మాజీ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దారుట్ల జీవన్, పర్వతిసత్యనారాయణ, నల్లరత్నాకర్‌రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు కట్కం రాందాస్, అశోక్ రెడ్డి, డి.రమేష్‌లతో పాటు ఆడ గ్రామ ప్రజలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పార్టీ కండువాలు కప్పిఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

నాలుగవ తరగతి ఉద్యోగులకు పదోన్నతులు ఇవ్వాలి

ఉట్నూర్, జూలై30 (ఆంధ్రజ్యోతి):ఉట్నూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలోని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లో, వసతి గృహాలలో పని చేస్తున్న నాలుగో తరగతి ఉద్యోగుల్లో అర్హులైన వారికి పదోన్నతులు ఇవ్వాలని తెలంగాణ గిరిజన సంక్షేమ వాఖ నాలుగో తరగతి ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కేబీసీ నారాయణ, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు షౌకత్ హుస్సేన్‌లు కోరారు. ఈ మేరకు రాజదానిలోని ప్రజా భవన్‌లో అక్కడి అధికారులకు వినతి పత్రాలు సమర్పించగా వారు కమిషనర్‌కు పరిశీలించాలని ఆదేశించినట్లు వారు తెలిపారు.ఆశ్రమ పాఠశాలలో కొంత మంది ఉపాధ్యాయులను డిప్యూటీ వార్డెన్లుగా నియమించడం ద్వారా విద్యార్థులకు చదువులు కొనసాగడం లేదని అర్హులైన 4వ తరగతి ఉద్యోగులకు ఆశ్రమ పాఠశాలలో డిప్యూటీ వార్డెన్లుగా అవకాశం కల్పించాలన్నారు. 20 శాతం పదోన్నతులు ఇవ్వాలని ఉండగా కేవలం 10 శాతం మందికి మాత్రమే హాస్టల్ వెల్ఫేర్ ఆఫీర్లుగా నియమించారన్నారు. ఇదే కాకుండా గిరిజన సంఖ్యాంశాక ఆశ్రమ పాఠశాలలో పని చేస్తున్న తాత్కాలిక వర్కర్లు, శానిటేషన్ సిబ్బందికి సకాలంలో వేతనాలు ఇవ్వడంతో పాటు పెరిగిన ధరలకు అనుగునంగా వేతనాలు పెంచాలని కోరారు.

ఘనంగా తెలంగాణ విద్యార్థి పరిషత్ ఆవిర్భావ దినోత్సవం

ఆదిలాబాద్ టౌన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): తెలంగాణ విద్యార్థి పరిషత్ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా జరిపారు. సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర ఆర్గనైజర్ సెక్రెటరీ కొట్టురి ప్రవీణ్ కుమార్ కార్యక్రమ ముఖ్య అతిథిగా హాజరై టీజీవీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో లంబాడ ఐక్యవేదిక లైవ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు మహేందర్, గొర్ల నరేందర్, సతీష్, వెంకట్, కరణ్, అజయ్ కుమార్, గణేష్, విఠల్ పాల్గొన్నారు.

అధికారులు తీరు అప్రజాస్వామికం

భైంసా, జూలై 30(ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డుల పంపిణీ ప్రక్రియలో భైంసా మండల అధికారులు అప్రజాస్వామికంగా వ్యవహరించారని మిర్జాపూర్ సహకార సంఘం చైర్మెన్ అమెడ దేవేందర్ రెడ్డి, భైంసా ఆత్మ కమిటీ చైర్మెన్ సిద్దంవార్ వివేక్, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ ఫారుఖ్ అహ్మద్‌లు ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు.బుధవారం స్థానికంగా విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. స్థానిక సురలోక్ గార్డెన్స్‌లో బుధవారం నిర్వహించిన రేషన్‌కార్డుల మంజూరి పత్రాల పంపిణీ కార్యక్రమంలో తమను ప్రోటోకాల్ నిబంధన పేరిట అధికారులు నిలువరించేలా వ్యవహరించారని దుయ్యబట్టారు.ఇందులో ఆత్మడైరెక్టర్లు, కాంగ్రెస్‌నాయకులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో స్పాట్ అడ్మిషన్లు

బజార్‌హత్నూర్,జూలై30(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలలో ఆరవ తరగతి నుంచి పదవ తరగతి అలాగే ఇంటర్ ఎంఈసీ, సీఈసీ మొదటి సంవత్సరంలో మిగిలి పోయిన సీట్లను భర్తీ చేస్తున్నట్లు ప్రిన్సిపల్ ప్రేమ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అందుకు ఆగస్టు 2న స్పాట్ అడ్మిషన్లు ఉంటాయన్నారు. బజార్‌హత్నూర్, ఇచ్చోడ మండలాల పరిసర ప్రాంతాల్లోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలన్నారు. సంబంధిత సర్టిఫికేట్స్‌లతో కళాశాలలో నిర్వహించే కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని పేర్కొన్నారు.

ఘనంగా తెలంగాణ 13వ ఆవిర్భావ వేడుకలు

నిర్మల్ టౌన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): తెలంగాణ విద్యార్థి పరిషత్ 13వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని ముఖ్య అతిథిగా నిర్మల్ అధ్యక్షులు ట్రస్మా చంద్ర గౌడ్ హాజరై మొక్కలు నాటారు. నిర్మల్ అధ్యక్షులు ట్రస్మా చంద్ర గౌడ్ ఉమ్మడి నిర్మల్‌లో బుధవారం తెలంగాణ విద్యార్థి పరిషత్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ పట్టణ కన్వీనర్ సాయి చరణ్, కో కన్వీనర్ సురేష్, మణికంఠ, అభిరామ్, అజయ్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ

ఆదిలాబాద్ టౌన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): నిత్య జీవితంలో ఎదురయ్యే సమస్యలను అధిగమిస్తూ పిల్లలకు ఉన్నత విద్య అందేలా తల్లిదండ్రులు కృషి చేయాలని సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డి అన్నారు. బుధవారం ఆదిలాబాద్ పట్టణంలోని కేఆర్‌కే కాలనీలోని ప్రాథమికొన్నత పాఠశాలలో విద్యార్థులకు చేయూత కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి సోమయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అలీ, పాఠశాల చైర్మన్ రజియా సుల్తాన, ఉపాధ్యాయులు నవీన్ యాదవ్ పాల్గొన్నారు.

మాత శిశు సంరక్షన కోసం కృషి చేయాలి

ఉట్నూర్, జూలై30(ఆంధ్రజ్యోతి):గిరిజన గ్రామాల మహిళలను చైతన్యపరిచి మాత శిశు మరణాలు జరగకుండా కృషి చేయాలని మాతకి సంరక్షణ జిల్లా అధికారి డాక్టర్ సాధన అన్నారు. బుధవారం మండలంలోని హస్నాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సందర్శించి చాందూరి, హస్నాపూర్, రాంపూర్, పెర్కాగూడెం సబ్ సెంటర్ల ఏఎన్ఎంలు, డాక్టర్ శికారి సాయికిరణ్‌తో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సమావేశంలో సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ

దిలావర్‌పూర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎన్‌సీడీ కార్యక్రమం జిల్లా అధికారి డా. ఆశిష్ రెడ్డి ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారిణి ప్రియాంకకు సూచించారు. కాలానుగుణంగా వచ్చే వ్యాధుల నివారణకు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. డ్రై డే కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలన్నారు. రోగులకు ఇబ్బంది కలుగకుండా, వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచనలు చేశారు.

బాలుర రెసిడెన్సియల్ పాఠశాలలో డెంగీ

ఆదిలాబాద్ రూరల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ పట్టణంలోని ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, కాలేజిలో ఒక డెంగీ కేసు రావడంతో అప్రమత్తమైన జిల్లా వైద్యాధికారులు డా.నరేందర్‌రాథోడ్, స్పెషల్ ఆఫీసర్ జక్కులశ్రీనివాస్ అకస్మికంగా తనిఖీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డా.సర్వరాజ్, సూపర్‌వైజర్ ఆడేసురేష్, హెల్త్ అసిస్టెంట్ ఈశ్వర్‌రెడ్డి, ఎం.ఎల్ హెచ్‌పీ సౌజన్య, ఆశా స్కూల్ ప్రిన్సిపల్, స్టాఫ్ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

నిర్మల్ రూరల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): ప్రముఖ వైద్యులు డా.వేణుగోపాలకృష్ణ జన్మదినం, తన మాతృమూర్తి జన్మదినాన్ని పురస్కరించుకొని ఇద్దరు కలిసి మంజులాపూర్‌లో గల వృద్ధాశ్రమంలో వైద్య శిబిరం నిర్వహించి, అన్నప్రసాదం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డా. నీలిమ, వివేక్ కృష్ణ, అంజి, ఉదయ చంద్ర, ల్గొన్నారు.

మాజీ మున్సిపల్ చైర్మన్‌ను పరామర్శ

నిర్మల్‌రూరల్/దిలావర్‌పూర్,జూలై 30(ఆంధ్రజ్యోతి): డాక్టర్ అప్పాల చక్రధారి, మాజీ మున్సిపల్ చైర్మన్ అప్పాల మహేష్ తల్లి అప్పాల పోసాని అనారోగ్యం కారణంతో బుధవారం మరణించడంతో విషయం తెలుసుకున్న మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. వీరితో డీసీసీబీ డైరెక్టర్ నారాయణ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ తదితరులు ఉన్నారు.

కడెం: మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు ముసుకు భాస్కర్ తండ్రి ముసుకు దేవరెడ్డి హైదరాబాద్‌లోని కేర్ ఆసుపత్రిలో గుండె సంబంధిత చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలిసిన బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ బుధవారం ఆసుపత్రికి వెళ్లి దేవరెడ్డిని పరామర్శించారు.

ముగిసిన ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామరావు పటేల్

కుంటాల,జూలై, 30(ఆంధ్రజ్యోతి):మండలంలోని అంబకంటి గ్రా మంలో వేద పండితులు భగవాన్ జోషి ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా కొనసాగుతున్న శివాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు బుధవా రం తో ముగిశాయి. బుధవారం ఆఖరి రోజున వేద పఠనము, మండపాంగ ఆరా ధన, హోమము, గర్తన్యాసము, యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, శిఖరప్రతిష్ఠ, పూర్ణాహుతి, ప్రోక్షణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇట్టి కార్యక్రమం లో ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంత జీవితం లభిస్తుం దని, శ్రావణ మాసం సందర్భంగా ప్రజలు శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని,ఇందులోభాగంగా రాబోయేరోజుల్లో తమ వంతుగా మరిన్ని గ్రామాలలో నూతన శివాలయాలు నిర్మించేందుకు కృషి చేస్తానన్నారు.ఈయన వెంట మాజీ ఎంపీపీలు అప్కగజ్జారాం యాదవ్, రమణ రావు, వెంగల్‌రావు, మండల కన్వీనర్ పసులనవీన్‌తో బీజేపీ నాయకులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : ఎమ్మెల్యే అనిల్



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

నేరడిగొండ, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను తలమడుగు, గుడిహత్నూర్, భీంపూర్ మండలాలకు చెందిన పలువురు నాయకులు, గ్రామస్థులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామంలోని అంతర్గత రోడ్లు, మౌలిక వసతులు, ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని విన్నవించారు. సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఇందులో ఆయా మండలాల నాయకులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు తొలి ప్రాధాన్యం

ఆదిలాబాద్ టౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : కొబ్బరి బొండాల వ్యాపారస్తులు తమ దుకాణాల వద్ద పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ విజయ్ కుమార్ ఆదేశించారు. కలెక్టర్ సూచనల మేరకు బుధవారం పుర అధికారులు దుకాణాలను తనిఖీ చేశారు. అపరిశుభ్రంగా ఉంచిన వ్యాపారస్తులకు తగు సూచనలు చేశారు. నిబంధనలు పాటించని పక్షంలో జరిమానాలు విధించి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రస్తుతం తనిఖీలు జరిపి జరిమానాలు విధిస్తున్నామని, మార్పు రానిపక్షంలో కేసులు సైతం నమోదు చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్, ఎన్విరాన్మెంటల్ అధికారి అవికిరన్ పాల్గొన్నారు.

పౌర హక్కులపై అవగాహన కల్పించాలి

తలమడుగు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మారుమూల గ్రామాల్లోనూ పౌర హక్కులపై అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని సివిల్ రైట్స్ డే జిల్లా కమిటీ మెంబర్ శశికాంత్ కోరారు. మండల కేంద్రంలోని సుంకిడి గ్రామంలో మండల అధికారులు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరైన జిల్లా ఎస్సీ అట్రాసిటీ అండ్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ ఐండ్ల శశికాంత్ మాట్లాడుతూ మండల కేంద్రంలోని ప్రతినెల ఒక గ్రామాన్ని ఎంచుకుని ఆ గ్రామం నందు సివిల్ రైట్స్ డే కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలని, ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలు డీవీఎంసీ మెంబర్ దృష్టికి తీసుకురావాలని కోరారు. సమస్యలు స్థానిక, జిల్లా అధికారులు అదేవిధంగా రాష్ట్ర స్థాయి అధికారులచే చర్చించి సమస్యలను పరిష్కరించే దిశగా వెళ్తామని కోరారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ రాజమోహన్, ఎంపీడీఓ శంకర్, సెక్రెటరీ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జిపై అధిష్టానానికి ఫిర్యాదు

బోథ్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జిని మార్చాలంటూ కాంగ్రెస్ పార్టీకి చెందిన కొంతమంది నాయకులు అధిష్టానానికి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. రెండు రోజుల క్రితం నేరడిగొండ, గుడిహత్నూర్, ఇచ్చోడ మండలాలకు చెందిన కొంతమంది కాంగ్రెస్ పార్టీ నాయకులు తమ ఇంచార్జి వ్యవహార శైలి వల్ల పార్టీ దెబ్బతింటున్నానని ఆయనను మార్చితేనే పార్టీ పరిస్థితి బాగుపడుతుందంటూ కాంగ్రెస్ పార్టీ టిపిసిసి రాష్ట్ర అధ్యక్షుడు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు సమాచారం

సర్వీసుల మంజూరుకు సింగిల్ విండో వ్యవస్థ

ఆదిలాబాద్, జూలై 30(ఆంధ్రజ్యోతి): హెచ్‌టీ సర్వీసుల మంజూరుకు సింగిల్ విండో వ్యవస్థ ఎంతగానో దోహద పడుతుందని విద్యుత్ శాఖ ఎస్ఈ జేఆర్ చౌహాన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ హోల్టేజి దరఖాస్తులు పరిశీలించి ఫీజుబూలిటి ఉన్న దరఖాస్తులను రెండు రోజుల్లో ఆమోదం తెలుపడం జరుగుతుందన్నారు.వివిధ కారణాల వల్ల సాధ్యపడక పోతే కారణాలను ఎస్ఎంఎస్ రూపంలో వినియోగదారులకు అందజేస్తామన్నారు. అలాగే 33 కేవీ ఆపై ఓల్టేజి దరఖాస్తులు పరిశీలించి వెంటనే కావాల్సిన మౌళిక వసతుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. సింగిల్ విండో వ్యవస్థ ద్వారా త్వరితగతిన సర్వీసులు మంజూరవుతాయని ఏమైనా సమస్యలు ఉంటే ట్రాక్ చేసుకునే సౌకర్యం ఉంటుందన్నారు.వినియోగదారులు ఈజీఎన్‌పీడీసీఎల్ పోర్టల్‌లో అవసరమైన పత్రాలతో హెచ్‌టీ దరఖాస్తులు చేసుకున్న తర్వాత కొత్త అప్లికేషన్ నెంబర్ నమోదు కావడం జరుగుతుందన్నారు.అలాంటి దరఖాస్తులు డ్యాష్‌బోర్డులో ప్రదర్శించడం జరుగుతుందని తెలిపారు. ప్రతిరోజు విద్యుత్ శాఖ అధికారులు డ్యాష్‌బోర్డును పరిశీలించడం జరుగుతుందని దరఖాస్తు చేసుకున్న వారికి వెంటనే ఆమోదం తెలుపుతు సర్వీసులను మంజూరు చేసే అవకాశం ఉందన్నారు.

పంటలను కాపాడుకోండిలా

» భైంసా మండల వ్యవసాయాధికారి గణేష్


పత్తి చేనులో నిలిచిన వర్షపు నీరు

భైంసా, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఐదు రోజులుగా అంత టా వర్షాల ప్రభావం కొనసాగుతోంది. రోజు కురుస్తున్న వర్షాల మూలంగా పలు ప్రాంతాల్లోని పంటచేలలో వర్షపు నీరు నిలిచిపోతోంది. ఈ క్రమంలో పంటల పైర్లు దెబ్బం తింటున్నాయి. అంతేకాకుండా ప్రతికూల వాతావరణ పరిస్థితుల మూలంగా సాగులోనున్న వివిధ రకాల పంటలు తెగుళ్ల బారిన సైతం పడుతున్నాయి.

పత్తి పంట : పత్తి చేలల్లో నిలిచిన వర్షపు నీటిని బయటకు పంపించే చర్యలు చేపట్టాలి. భూమిలో తేమను తగ్గించడానికి అంతర సేద్యం చేయాలి. 30 నుంచి 45 రోజుల దశలోనున్న పత్తి పంటకు ఎకరానికి రెండు కిలోల యూరియా, 10 కిలోల పోటాష్ ఎరువులు వేయాలి. అంతర సేద్యం కుదరనపుడు పత్తి విత్తనాలు విత్తిన నాటి 30 నుంచి 40 రోజుల దశలో క్విజలోఫాస్ ఇథైల్ 400 మి.లీటర్లు, ఫెరిథాయోబ్యాక్ 25 మి.మీ 10 లీటర్ల నీటికి కలిపి మొక్కల మొదళ్లలో తడపాలి. పత్తిలో బ్యాక్టీరియా ఆకుమచ్చ తెగులు ఆశించే అవకాశం ఉన్నందున 30 గ్రాముల కాపర్ అక్సిక్లోరైడ్, స్ట్రెప్టోమైసిన్ లేదా ప్లెప్టోసైక్లిన్ ఒక గ్రామును ప్రతి 10 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలి

మొక్కజొన్న : మొక్కజొన్న అధిక తేమను తట్టుకోదు. నీటిని త్వరగా తీసివేయాలి. 25 కిలోల నత్రజని, 10 కిలోల పోటాష్‌ను ఇచ్చే ఎరువులు వేయాలి. మోకాలి ఎత్తు దశలో కాండం తొలిచే పురుగు ఆశిస్తే కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు ఎకరానికి 3 కిలోలు ఆకు సుడుల్లో చల్లాలి

సోయా : పంట చేనులో వర్షపు నీరు నిలవడం మూలంగా మొక్క ఎదుగుదల తగ్గిపోతుంది. పోగాకు లద్దె పురురు, ఆకుపచ్చ, వేరుకుళ్లు తెగులు ఆశిం చే అవకాశం ఉంది. ముందుగా పంటచేలలో నిలిచిన వర్షపు నీటి తీసివేయాలి. 10 గ్రాముల యూరియా లీటర్ నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు పర్యాయాలు పిచికారి చేయాలి.

నెట్టింట నవ్వుల్.. నవ్వుల్


సన్నివేశం చిత్రీకరిస్తున్న 5జి థింక్స్ టీమ్

» వేలల్లో ఫాలోవర్స్..మిలియన్‌లలో వ్యూస్
» ఒకపక్క వ్యవసాయం..మరోపక్క కామెడీతో సందడి
» పేరులో చిన్నక్క.. నటనలో పెద్దక్క
» 5జీ థింక్స్‌తో దూసుకుపోతున్న యువకుడు

పట్టణాల్లో మాత్రమే టాలెంట్ ఉంటుందనుకునే రోజులు పోయాయి. ఇప్పుడు పల్లెటూరి వీధుల నుంచే సోషల్ మీడియా ప్రపంచాన్ని ఊపేస్తున్నారు. కుటుంబ బాధ్యతల మధ్య... మొబైల్ ఫోన్‌తో రీల్స్ చేస్తూ, మిలియన్ల మందిని నవ్విస్తున్నారు. తమ స్వభావమైన స్వచ్ఛమైన పల్లె భాష, కామెడీ టైమింగ్, సమాజాన్ని తాకే వి నోదంతో యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ వేదికల్లో గుర్తింపు సంపాదిస్తున్నారు. పొలం పనులు చేయడం ఎంత సహజమో... కెమెరా ముందు నటించడ మూ అంతే సహజంగా చేస్తున్న నెటిజన్ల మనసు గెలుచుకొంటున్నారు.

దస్తురాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలంలోని ఆకొండపేట గ్రామానికి చెందిన విద్యాసాగర్ అనే యువకుడు తన అత్తమ్మ చిన్నక్క, టీమ్‌తో కలిసి '5జి థింక్స్' అనే చానల్‌లో తమ జ్ఞానం, చమత్కారాన్ని వినోదంగా మార్చి సోషల్ మీడియా ద్వారా ఆదాయ మార్గాలను సైతం సృష్టించుకుంటున్నారు. రోజు జీవితం వ్యవసాయంతోనే గడిపేస్తూ, అదే సమయంలో సోషల్ మీడియా వేదికగా నవ్వుల పంట పండిస్తున్నారు. తెలుగులా పల్లెటూరి మాటలు, అనుభవాలను వినోదాత్మకంగా చూపిస్తూ గుర్తింపు పొందుతున్నారు. గ్రామీణ యువతకు ఇది ఒక ప్రేరణగా మారుతోంది.


చిన్నక్క

ఆరు పదుల వయసులో అదరగొడుతూ..

ఆరు పదుల వయసులోను యువకులకు ఏమాత్రం తీసి పోకుండా నటనలో అదరగొడుతోంది చిన్నక్క. 5జీ థింక్స్ ఛానల్ యాక్టర్ చిన్నక్క పల్లెటూరి మట్టి వాసనలో బడిలేకపోయిన మాటలు, మనసుని తాకే హావాభావాలు, ఆరు పదుల వయసులోను నవ్వులు పండిస్తూ, ఊరిలోని సాధారణ సంఘటనలను హాస్యాత్మకంగా తనదైన శైలిలో ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది.


యూట్యూబ్ సిల్వర్ బటన్‌తో 5జి థింక్స్ టీమ్

యూట్యూబ్ నుంచి సిల్వర్ బటన్...

పల్లెటూరి పచ్చదనాన్ని, హాస్యంతో మేళవించిన వీడియోలతో ప్రేక్షకుల మనసు గెలుచుకున్న ఈ 5జీ థింక్స్ టీమ్ యూట్యూబ్ నుంచి సిల్వర్ బటన్‌ను అందుకున్నారు. తక్కువ సమయంలోనే లక్షకు పైగా సబ్‌స్క్రైబర్స్‌ను సంపాదించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.

నటన మీద ఆసక్తితో..

- విద్యాసాగర్, 5జీ థింక్స్ చానల్ క్రియేటర్



నటన మీద ఆసక్తితో యూట్యూబ్‌లో చానల్‌ను పెట్టాను. విలేజ్ కంటెంట్‌తో వీడియోలు చేస్తూ నా ప్రయాణం మొదలుపెట్టాను. నాకు మద్దతుగా నిలిచిన గ్రామస్థులకు, నా టీమ్‌కి కృతజ్ఞతలు. కొత్త కొత్త ఆలోచనలు ఉంటే నాతో పంచుకుంటే వాటికి దృశ్య రూపం ఇస్తా.

రోడ్డుపై వర్షం నీటితో ఇబ్బందులు


రోడ్డుపై వర్షం నీరు నిల్వ ఉన్న దృశ్యం

ముథోల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్ర మైన ముథోల్‌లోని మహాలక్ష్మి సమీపంలో రోడ్డుపై వర్షం నీరు నిల్వ ఉండటంతో ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఇటీవల రోడ్డు నిర్మించినప్పటికీ కొద్దిపాటి వర్షంకు ఈ రోడ్డుపై వర్షం నీరు నిల్వ ఉంటుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

వీడని ముసురు.. ఇబ్బందుల్లో ప్రజలు


దంతన్‌పల్లి వంతెన వద్ద రోడ్డుకు గుంతలు పడ్డ దృశ్యం

ఉట్నూర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా ముసురు వర్షం కురుస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అటు భారీ వర్షం కురవడం లేదని, ముసురు వర్షంతో ఎలాంటి పనులు చేసుకోలేక పోతున్నామని ప్రజలు అంటున్నారు. పాఠశాలలకు, కార్యాలయాలకు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులతో పాటు ఇతర పనుల కోసం బయటకు వెళ్లే ప్రజల సైతం ముసురు వర్షంతో ఇబ్బందులు పడుతున్నారు. ముసురు వర్షంతో గొడుగులకు గిరాకి పెరిగింది. పేద ప్రజలకు చెందిన పెంకుటిండ్లు ఊరుస్తుండడంతో పై కప్పులను సరి చేసుకుంటున్నారు.

గుంతలు పడుతున్న రోడ్లు..

గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రధాన రోడ్ల పై గుంతలు ఏర్పడుతున్నాయి. ఉట్నూర్ మండలంలోని దంతనపల్లి వాగు సమీపంలో ప్రతియేటా మరమ్మతులు చేస్తున్నప్పటికీ కురుస్తున్న వర్షాలకు గుంతలు పడడంతో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతుందని వాహనదారులు అంటున్నారు. గత నాలుగేళ్ల క్రితం దంనతపల్లి వద్ద తెగిపోయిన రోడ్డుకు ఆర్‌అండ్‌బీ అధికారులు మొరం వేయించారు.

ఎడ్లబండిపై.. కూల్‌కూల్‌గా..


వర్షంలో ఎద్దుల బండిపై ప్రయాణిస్తున్న మహిళా కూలీలు

తాంసి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కలుపు మొక్కలు తీయడానికి వెళ్లిన కూలీలకు వర్షం కురిసింది. కురుస్తున్న వర్షంలో చల్ల చల్లని చినుకుల మధ్య తడుస్తూ ఎడ్ల బండిపై తమ ఇళ్లల్లోకి ప్రయాణమయ్యారు. గత మూడు రోజుల నుంచి తాంసి మండలంలోని ఆయా గ్రామాల్లో వర్షం కురుస్తుంది. బుధవారం ఉదయం పొలం పనులకు వెళ్లిన మహిళా కూలీలకు పనులు ప్రారంభించగానే వర్షం కురిసింది. వర్షంలో తడుస్తూ ఎద్దుల బండిపై కూల్ కూల్‌గా ఇంటి బాట పట్టారు.

ఆసరా కోసం అవస్థలెన్నో..


పోస్టాఫీసు ముందు పింఛన్ డబ్బుల కోసం వేచి చూస్తున్న లబ్ధిదారులు

తాంసి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విధిస్తున్న కొత్త నిబంధనలతో ఆసరా పెన్షన్ లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెన్షన్ డబ్బుల కోసం గంటల తరబడి క్యూ కట్టాల్సిన పరిస్థితి నెలకొంటుంది. తాంసి మండల కేంద్రాల్లో బుధవారం ఆసరా డబ్బులను పంపిణీ చేశారు. ఈ విషయాన్ని తెలుసుకు న్న లబ్ధిదారులు పంపిణీ కేంద్రం వద్దకు బారులు తీరారు. ప్రస్తుతం కళ్ల స్కానింగ్‌తో పెన్షన్లను పంపిణీ చేస్తున్నారు. అయితే సర్వర్ సతాయించడంతో ఒక్కో లబ్ధిదారునికి 20 నిమిషా ల నుంచి అరగంట సమయం పడుతుంది. దీంతో లబ్ధిదారులు కురుస్తున్న వ ర్షంలోను పెన్షన్ డబ్బుల కోసం వేచి చూసిన సంఘటన వెలుగులోకి వచ్చింది. ఇక వృద్ధుల పరిస్థితి అయితే మరింత దయనీయంగా మారింది. కంటిచూపు సన్నగించడం, వేలిముద్రలు పడకపోవడంతో గత రెండు నెలలుగా వృద్ధులు పెన్షన్లకు నోచుకోలేకపోతున్నారు. వెంటనే జిల్లా కలెక్టర్, ప్రభుత్వ యంత్రాంగం స్పందించి సకాలంలో ఆసరా డబ్బులను అందించాలని కోరుతున్నారు.

మహా అన్నదానం

తలమడుగు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం పురస్కరించుకొని మండలంలోని కజర్ల గ్రామంలో నిర్వహిస్తున్న శబరిమాత అఖండ జ్యోతి కార్యక్రమానికి బుధవారం రుయ్యాడీ శబరిమాత భక్తులు గ్రామస్తులు మహా అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ నెలరోజుల పాటు అఖండ జ్యోతి కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం సీఈవో మోతి, టీఆర్ఎస్ అధికార ప్రతినిధి కిరణ్ కుమార్, మాజీ మున్సిపల్ కమిషనర్ దేవారెడ్డి, మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి గంగన్న శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలి

బోథ్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరత్వాడ గ్రామ పంచాయితీలోని జీడిపల్లి గ్రామస్తులు బుధవారం తమ గ్రామంలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు. తమ గ్రామంలో వంద శాతం ఆదివాసీ గిరిజనులు ఉన్నారని 450 ఓటర్లు ఓట్లు వేస్తారని పేర్కొన్నారు. గ్రామానికి ఆరు కిలో మీటర్ల దూరం వెళ్లాల్సి ఉన్నందున తమ గ్రామంలోని పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని వారు కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్‌ను కలిసి తమ సమస్యను విన్నవించారు.

వలస కూలీలతో వరినాట్లు

» రైతులకు తప్పిన ఆగచాట్లు! స్థానికంగా కూలీల కొరత
» యూపీ, బీహార్, మహారాష్ట్ర, నల్గొండ నుంచి కూలీల రాక
» రోజుకు నాలుగు నుంచి ఐదెకరాల్లో నాట్లు
» ఎకరాకు రూ. 5,500ల చెల్లింపు


నాటు వేస్తున్న బీహార్ కూలీలు


వరి నారు తీస్తున్న బీహార్ కూలీలు

దిలావర్‌పూర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న ముసురు వర్షంతో గ్రామాల్లో వరినాట్ల సందడి మొదలైంది. నెలన్నర కాలంగా వర్షాభావ పరిస్థితి వల్ల రైతులు వరినాట్లు వేయలేకపోయారు. బోరుబావుల కింద మాత్రం వరినాట్లు దాదాపు పూర్తి కావచ్చినప్పటికీ చెరువులు, కుంటల కింద వర్షాలు లేక వరి నాట్లు మొదలు కాలేదు. వారం రోజులుగా కురుస్తున్న వర్షంతో చెరువుల్లోకి వరద నీరు చేరుతుండటంతో ఆయకట్టు రైతుల్లో వరి సాగుపై ఆశలు చిగురించాయి. వర్షాలు లేక ఇప్పటికే ఆలస్యమైన వరినాట్లను పూర్తి చేసేందుకు రైతులంతా ఒకేసారి సిద్ధమవుతుండటంతో కూలీల కొరత రైతులను ఇబ్బందికి గురిచేస్తోంది.

వలస కూలీలతో రైతులకు ఊరట..

స్థానికంగా కూలీల కొరత ఏర్పడటంతో పాటు ఉన్న ఆ కూలీలు ఎక్కు వ డబ్బులు డిమాండ్ చేస్తుండటంతో రైతులకు ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో వలస కూలీల రాక రైతులకు కొండంత ఊరటనిస్తోంది. నాలుగేళ్లుగా రైతులు వలస కూలీలపైనే ఆధారపడుతున్నారు. ఉత్తరప్రదేశ్, బీహార్, మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్, ఒడిస్సా రాష్ట్రాల నుంచే కాకుండా తెలంగాణలోని నల్గొండ, మహబూబ్ నగర్ తదితర ప్రాంతాల నుంచి కూలీలు వరి నాట్లు వేసేందుకు మండలంలోని గ్రామాలకు వలస వస్తున్నారు. కొంత మంది స్థానికులు ఆయా ప్రాంతాలకు చెందిన వలస కూలీలను గ్రామాలకు తీసుకువచ్చి వారికి ఆశ్రయం కల్పిస్తున్నారు. వలస కూలీలతో ఎకరానికి ఇంత కమిషన్ అని ఒక ధరను ఒప్పందం చేసుకొని రైతుల నుం చి ఎక్కువ మొత్తం తీసుకుని వరి నాట్లు వేయిస్తున్నారు. కూలీలు రావడం, వర్షాలు కురువడంతో మండలంలో వరి నాట్లు ఊపందుకుంటున్నాయి. ప్రధానంగా దిలావర్‌పూర్, సిర్గాపూర్, సాంగ్వి, కాల్వ, బన్సపల్లి, గుండంపల్లి, సముందర్ పల్లి గ్రామాల్లో రైతులు పెద్ద మొత్తంలో వరి సాగు చేస్తారు. ఆయా గ్రా మాల్లో రైతులందరూ ఒకేసారి నాట్లకు ఉపక్రమించడంతో వలస కూలీలకు డిమాండ్ పెరిగింది.

ఎకరాకు రూ. 5,500లు.. రోజుకు ఐదెకరాల నాటు

వలస కూలీలు ఎకరాకు రూ. 5,500లు తీసుకొని రోజుకు నాలుగు నుంచి ఐదు ఎకరాల పొలములో నాట్లు వేస్తున్నారు. ఒక్కొక్క గ్రూపులో 18 నుంచి 20 మంది కూలీలు ఉంటున్నారు. తెలంగాణలోని మహబూబ్ నగర్, నల్గొండ ప్రాంతాల నుంచి ప్రాంతాల నుంచి వచ్చిన గ్రూపుల్లో మహిళలు, పురుషులు ఉండగా ఇతర రాష్ట్ర నుంచి కేవలం పురుషులు మాత్రమే వచ్చారు. వలస కూలీలు నారు తీయడంతో పాటు పిండి (కాంప్లెక్స్ ఎరువు) చల్లి నాట్లు వేస్తుండడంతో రైతులకు ఎలాంటి ఇ బ్బంది లేకుండా ఉంది. వలస కూలీలకు సైతం డిమాండ్ పెరగడంతో ఒక్కో రైతుకు ఒక్కో తేదీ ఇస్తూ బుకింగ్ చేసుకుని వరి నాట్లు వేస్తున్నా రు. వలస కూలీలకు ఆశ్రయం కల్పించి రైతుల వద్ద పొలాలను బుకింగ్ చేస్తున్న మధ్యవర్తులు ఎకరానికి రూ. 400ల నుంచి రూ. 500ల వరకు కమిషన్ కింద కూలీల నుంచి తీసుకుంటున్నారు. దీంతో మధ్యవర్తులు సైతం వలస కూలీలతో ఉపాధి పొందుతున్నారు. డబ్బులు పోయిన ప ర్వాలేదు కానీ ఎలాంటి ఇబ్బంది లేకుండా సకాలంలో నాటు వేయాలన్న ఆలోచనతో రైతులు వలస కూలీలకు అడిగినంత డబ్బులు ఇచ్చి నాట్లు వేయించుకుంటున్నారు. వలసన కూలీల రాకపోత వరినాట్లు సకాలంలో పడడంతో పాటు కూలీల కొరత తీరిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


నాటు కోసం పొలంను ట్రాక్టర్‌తో దమ్ము చేస్తున్న దృశ్యం

మూడేళ్ల నుంచి వస్తున్నాం..

- చోటా సహాని, వలస కూలీ, బీహార్



ఇక్కడ మాకు చేతినిండా పని దొరుకుతుంది. మూడు సంవత్సరాలుగా వస్తున్నాం. మా గ్రూపులో మొత్తం ఇరవై మంది ఉంటాం. రోజుకు నాలుగు నుంచి ఐదు ఎకరాల పొలం నాటు వేస్తాం. మా రాష్ట్రంలో మగవాల్లే నాట్లు వేస్తారు. ఆ అనుభవం ఇక్కడ బాగా వర్కౌట్ అవుతోంది.

వలస కూలీలతో తప్పిన ఇబ్బందులు

- శ్యామ్‌సుందర్ రెడ్డి, రైతు, బన్సపల్లి



రైతులంతా ఒక్కసారే నాట్లు వేసేందుకు సిద్ధం కావడం వల్ల కూలీల కొరత ఇబ్బంది పెట్టేది. కానీ బీహార్, మహారాష్ట్ర, యూపీ నుంచి కూలీలు రావడంతో ఇబ్బందులు తొలగిపోయాయి. డబ్బులు పోతే పోయే గాని సకాలంలో నాట్లు వేసుకుంటు న్నాం. ఇదే సంతోషము.

క్రిమి సంహారక మందు పిచికారితో పసుపు పచ్చగా పత్తి పంట

» దళిత రైతు లబోదిబో.. నిర్లక్ష్యంగా ఫర్టిలైజర్ యజమాని


పసుపు పచ్చగా మారిన పత్తి పంట

ఇంద్రవెల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): అతడో దళిత రైతు. కష్టనష్టాల కోర్చి రెండెకరాల్లో పత్తి పంటను సాగు చేశాడు. పత్తి పంట సాగుకు క్రిమిసంహారక మందు పిచికారి చేయగా పచ్చగా ఉన్న చేనంతా పసుపు పచ్చగా మారిపోయింది. పురుగుల మందు విక్రయించిన దుకాణదారుడు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పర్యవేక్షించాల్సిన వ్యవసాయ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. చేను లో పత్తి పంట పసుపు పచ్చగా మారిడానికి పిచికారీ చేసిన పురుగుల మందా లేక ఇతర కారణాలున్నాయా అనే సంగతి వ్యవసాయ శాఖ అధికారులు తేల్చేందుకు ఆ దిశగా ప్రయత్నాలు చేయడం లేదు.

● మందు పిచికారితో పసుపు పచ్చగా మారిన పత్తి పంట

బుర్సన్ పటార్ గ్రామానికి చెందిన సోన్ కాంబ్లే వికాస్ ఈనెల 20న తన పత్తి చేనులో పత్తి పంట సాగుకు మందులను మండల కేంద్రంలోని మాహన్ వికా ఫర్టిలైజర్ షాప్ నుంచి కాన్పిడర్ 100 జీతో పాటు ఆల్ బెర్ట్ సొల్యూషన్ అనే మందు ఒక కిలో ప్యాకెట్‌ను కొనుగోలు చేసి మరుసటి రోజు 21న కొనుగోలు చేసిన క్రిమి సంహారక మందులను దుకాణ యజమాని సూచన మేరకు ఆ రెండు మందులను కలిసి పత్తి పంటపై మందులను పిచికారి చేశారు. తరువాత చూస్తే రెండెకరాల పత్తి పంట మొత్తం పసుపు పచ్చగా మారిపోవడంతో రైతు సోన్ కాంబ్లే వికాస్ లబోదిబోమన్నాడు. పత్తి పంట సాగుకు నేటి వరకు రూ.35 వేలు పెట్టుబడి కాగా, ఏం చేయాలో దిక్కు తోచని స్థితిలో రైతు కొట్టుమిట్టాడుతున్నాడు. తనకు న్యాయం చేయాలని అర్జిస్తున్నాడు.

దివ్యాంగురాలికి సదరం సర్టిఫికెట్ అందజేసిన రాష్ట్ర బీసీ యువ నాయకులు

కడెం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్న బెల్లాల్, పెర్కపల్లె గ్రామానికి చెందిన దుంపటి సత్తవ్వకు అంగవైకల్యం విషయం తెలుసుకున్న రాష్ట్ర బీసీ యూత్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సౌదాని వెంకట రమణ యాదవ్ సదరం సర్టిఫికెట్‌ను అందజేశారు. సత్తవ్వ కుటుంబ సభ్యులు సదరం క్యాంపు సర్టిఫికెట్ ఇప్పించినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజన్న ఉన్నారు.

పిచ్చి మొక్కల్లో రేయిన్ గేజ్


కుభీర్ తహసీల్దార్ కార్యాలయం సమీపంలో పని చేయని రేయిన్‌గేజ్

కుభీర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : భవనాలు చెట్లు లేని విశాలమైన ఖాళీ ప్రదేశాల్లో లేదా ఎత్తైన భవనాల మీద రేయిన్‌గేజ్‌లను ఏర్పాటు చేస్తారు. రక్షణగా దాని చుట్టు ఇనుప కంచెను నిర్మిస్తారు. కుభీర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం, రైతు వేదిక పక్కన ఏళ్ల క్రితం వర్షమాణిని ఏర్పాటు చేశారు. రేయిన్ గేజ్ పక్కన చెట్లు పెద్దగా ఎదగడంతో భారీ వర్షాలు కురిసినా రేయిన్‌గేజ్‌లోకి చేరడం లేదు. చెట్లకు ఎండిన ఆకులు, కొమ్మలు పడుతున్నాయి. దాని చుట్టు ఉన్న రక్షణ కంచె తీగలు తుప్పుపట్టి పాడైపోయాయి. ఆకతాయిలు రేయిన్‌గేజ్‌లో రాళ్లు, బాటిళ్లు వేస్తున్నారు. మండలంలో కురుస్తున్న వర్షానికి అధికారులు ప్రకటిస్తున్న వర్షపాతాలకు పొంతన ఉండటం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. రేయిన్‌గేజ్‌లో నిర్దిష్ట ప్రమాణాలతో కూడిన సిలిండర్, గరాటు, గాజుసీసా, కొత పాత్ర ఉంటుంది వీటికి దుమ్ము, చెత్త లేకుండా తరచూ శుభ్రం చేయాలి. కానీ ఇవేమి పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా విశాలమైన ఖాళీ ప్రదేశానికి మార్చి కచ్చితమైన వర్షపాతం లెక్కించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



మార్కెట్‌లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న టమాటలు

మళ్లీ కొండెక్కిన టమాట

ముథోల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): టమాట ధర మళ్లీ కొండెక్కింది. 15 రోజుల వరకు కిలో రూ.30 నుంచి రూ.35 పలికిన ధర.. నేరుగా ఇప్పుడు రూ.80 నుంచి రూ. రూ.90 పలుకుతుంది. సామాన్యుడికి టమాట కోనేందుకు అందుత లేదు. వర్షాకాలంలోనే టమాటలు ఇలా ఉంటే ముందు ఇంకా ఎలా ఉంటాయని వినియోగదారులు పేర్కొంటున్నారు. హోల్ సేల్‌లో రూ.60 నుంచి రూ.70 పలుకగా పల్లెటూరులో వ్యాపారులు కిలో టమాటలు రూ. 80 నుంచి రూ.90 విక్రయిస్తున్నారు.

రేపు సామాజిక ప్రజా వేదిక

దిలావర్‌పూర్, జూలై 30(ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక 15వ విడత తనిఖీ ప్రజా వేదిక ఆగస్టు 1న శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో దివ్యరెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నిర్వహించే ప్రజావేదికలో ఆయా గ్రామాల ఉపాధి హామీ కూలీలు పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

నేడు రేషన్ కార్డుల పంపిణీ

తానూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన తానూరులో గురువారం నూతన రేషన్ కార్డులను పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ మహేంద్రనాథ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ హాజరై లబ్ధిదారులకు కార్డులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఉదయం 11 గంటలకు రైతు వేదికలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. లబ్దిదారులందరూ.. సమయానికి హాజరు కావాలని ఆయన సూచించారు.



నిర్మల్ పట్టణంలోని ప్రియదర్శిని నగర్ కాలనీలో ఇళ్ల మధ్య పేరుకుపోయిన చెత్తాచెదారం

మునిసిపాలిటీల్లో పాలన..
అస్తవ్యస్తం!

- జిల్లాలో ఖాళీలతో సతమతమవుతున్న మూడు మునిసిపాలిటీలు
- కీలక పోస్టుల్లో ఇన్‌చార్జీలే దిక్కు
- పట్టు తప్పిన పారిశుధ్యం
- అనుమతులు, సర్టిఫికెట్ల జారీలో తీవ్ర జాప్యం
- ఇబ్బందులు పడుతున్న స్థానిక ప్రజలు

నిర్మల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిర్మల్, భైంసా, ఖానాపూర్ మునిసిపాలిటీలలో పాలన అస్తవ్యస్తంగా మారింది. ఇక్కడి మునిసిపాలిటీలలో కీలక పోస్టులన్నీ ఖాళీగా ఉండడంతో పరిపాలన గాడి తప్పింది. ముఖ్యంగా మునిసిపాలిటీలను ముందుకు నడిపించే ప్రధాన పోస్టులు సైతం ఇక్కడ ఖాళీగా ఉండడంతో పనులలో తీ వ్ర జాప్యానికి కారణమవుతోందని చెబుతున్నారు. కీలక పోస్టులు ఖాళీగా ఉండడంతో బర్త్, డెత్ సర్టిఫికెట్లతో పాటు ముటేషన్లు, ఇంటి నిర్మాణ అనుమతులన్నీ తీవ్రమైన ఆలస్యం అవుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రజలు సర్టిఫికెట్ల కోసం మున్సిపల్ ఆఫీస్‌ల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నారు.

కీలక పోస్టులు ఖాళీ

నిర్మల్, భైంసా, ఖానాపూర్ మునిసిపాలిటీలలో కీలక పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. ఇక్కడి కీలక పోస్టులు ఖాళీగా ఉండడమే కాకుండా హెల్త్ అసిస్టెంట్ పోస్ట్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ పోస్టులు సైతం ఆశించిన సంఖ్యలో లేకపోవడం సమస్యకు కారణమవుతోంది. అలాగే మున్సిపల్ పరధిలో అభివృద్ధి పనులను పర్యవేక్షించాల్సిన సంబంధిత అసిస్టెంట్ ఇంజనీర్ పోస్టులు సైతం ఖాళీగానే ఉన్నాయి. ఈ పోస్టులన్నీ ప్రస్తుతం ఇన్‌చార్జీలతోనే కొనసాగుతుడడం గమనార్హం.అయితే ఇన్‌చార్జీలు వారానికోసారి ఇక్కడి ఆఫీసుకు వచ్చి తూతూమంత్రంగా తమ ఇన్‌చార్జి విధులు నిర్వహించి వెళ్లిపోతున్నారన్న ఫిర్యాదులు ఉన్నాయి.




- నిర్మల్ మున్సిపల్ కార్యాలయం ఇదే..

పడకేసిన పారిశుధ్యం

నిర్మల్, ఖానాపూర్, భైంసా మునిసిపాలిటీలలోని వార్డులలో పారిశుధ్యం పడకేసింది. ఇక్కడ పారిశుధ్యం పనులను పర్యవేక్షించే యంత్రాంగం అందుబాటులో లేని కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తూతూ మంత్రంగా చెత్త సేకరణ, మురికి కాలువల శుభ్రం లాంటి పనులు కొనసాగుతున్నాయి. నామమాత్రపు పనులు తప్ప క్రియాశీలకమైన పనులు చేపట్టకపోతుండడం ప్రజలకు శాపంగా మారుతుంది. పారిశుధ్య పనుల కోసం ఇక్కడి మునిసిపాలిటీలలో ఆటోలు కొనుగోలు చేసినప్పటికీ.. ప్రస్తుతం కేవలం కొన్ని ఆటోలు మాత్రమే చెత్త సేకరణకు ఉపయోగిస్తున్నారు. మిగతా ఆటోలు నెలల నుంచి పూర్తిగా చెడిపోయి మరమ్మతులు లేక ఇక్కడ ఆఫీసులోనే వృధాగా పడి ఉన్నాయి. పారిశుధ్యం కారణంగా భైంసాలోని అన్ని వార్డులు, ఖానాపూర్‌లోని 12 వార్డులలో, నిర్మల్‌లోని 42 వార్డులలో దోమలు, ఈగలు స్వైర విహారం చేస్తూ జనాన్ని రోగాల దరికి చేరుస్తున్నాయన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

కరువైన పర్యవేక్షణ

ముఖ్యంగా నిర్మల్, ఖానాపూర్, భైంసా మునిసిపాలిటీలలో పారిశుధ్య పర్యవేక్షణపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా చెత్త సేకరణ, మురికి కాలువలను శుభ్రం చేయడం లాంటి పనుల విషయంలో పూర్తి నిర్లక్ష్య ధోరణి కొనసాగుతోందని అంటున్నారు. పారిశుధ్య పనులను వార్డులలో పర్యవేక్షించాల్సిన సూపర్‌వైజర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండడం కూడా సమస్యకు కారణమవుతుందని చెబుతున్నారు. ప్రైవేట్ హోటళ్లు, దుకాణాల చెత్త సేకరణపై చూపినంత ఆసక్తి వార్డులు, గల్లీలలో చెత్త సేకరణపై వీరు దృష్టి సారించడం లేదన్న ఫిర్యాదులున్నాయి. అత్యధికంగా మున్సిపాలిటీకి పన్నులు చెల్లించే ప్రియదర్శిని నగర్, శాస్త్రినగర్, భాగ్యనగర్, దివ్య నగర్, ఆదర్శనగర్, తదితర వార్డులలో పారిశుధ్య లోపంతో ఇక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతీరోజు జరగాల్సిన చెత్త సేకరణ ప్రక్రియ మూడు, నాలుగు రోజులకు ఒకసారి మాత్రమే చెత్తను సేకరిస్తుండడంతో గల్లీలలోని ప్రధాన కూడళ్లు, రోడ్లపైనే చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయి. దీని కారణంగా దోమలు, దుర్వాసన జనాన్ని అవస్థల పా లు చేస్తున్నాయని అంటు న్నారు.





భట్టి విక్రమార్కను కలిసిన కాంట్రాక్టర్లు

పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి

- ఉప ముఖ్యమంత్రిని కలిసి కాంట్రాక్టర్లు

నిర్మల్ టౌన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో 'మన ఊరు-మన బడి' పథకం ద్వారా అభివృద్ధి పనులను చేపట్టి పెండింగ్ బిల్లుల కోసం వేచి చూస్తున్నామని, వెంటనే పెద్ద మనసుతో బిల్లులు మంజూరు చేయాలని కాంట్రాక్టర్లు బుధవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసి విన్నవించారు. లక్షల రూపాయల నిర్మాణాలు చేసి ఏళ్ల గడుస్తున్నా తమకు బిల్లులు రాక ఆర్థిక సంక్షేమంలో పడుతున్నామని వాపోయారు. బిల్లులు రాక ఓ కాంట్రాక్టర్ మృతి చెందినట్లు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పెండింగ్ బిల్లులను అందజేసే దిశగా ప్రభుత్వ ప్రయత్నం చేస్తుందని భరోసా కల్పించారు. ఇందులో అజీమ్ బీన్ యాహియా, మల్లారెడ్డి, శ్రీధర్ రావు, హబీబ్, ఫైజుద్దీన్‌లు ఉన్నారు.



ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న జిల్లా న్యాయాధికారి

దేవరకోటలో న్యాయాధికారి పూజలు

నిర్మల్ రూరల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీవేంకటేశ్వర దేవరకోట ఆలయంలో జిల్లా న్యాయాధికారి రాధిక ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ వారు బుధవారం తెలిపారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఇందులో మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, ఆలయ చైర్మన్ శ్రీనివాస్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిన్ను, తదితరులు పాల్గొన్నారు.



గడ్డెన్నవాగు ప్రాజెక్టులోని నీటి నిల్వలు

గడ్డెన్నవాగు ప్రాజెక్టులోకి 1,042 క్యూసెక్కుల వరద నీటి చేరిక

భైంసా, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతంలోని మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాల మూలంగా బుధవారం మండలంలోని గడ్డెన్నవాగు ప్రాజెక్టులోకి 1,042 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరింది. ఈ క్రమంలో మంగళవారం ప్రాజెక్టు నీటిమట్టం 357 మీటర్లు ఉండగా బుధవారం 0.2 మీటర్ల మేర పెరిగి 357.2 మీటర్లకు పెరిగింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 357.8 మీటర్లు, 1.83 టీఎంసీల నీటి సామర్థ్యం ఉండగా.. ఇప్పుడు 357.2 మీటర్ల నీటి మట్టంతో 1.046 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి. ప్రస్తుతం ఈ వానాకాలంలో ప్రాజెక్టులోకి 0.691 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరగా.. ఇక్కడి ప్రాంతంలో ఇప్పటి వరకు 414 మి.మీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది.

'పిల్లలను పనిలో పెట్టుకోవడం నేరం'

నిర్మల్ రూరల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): పిల్లలను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని బుధవారం బాలల సంక్షేమ సమితి సభ్యులు ఎల్. సైమన్సుందర్, జన్ను అనిల్, నల్ల శ్రీలత అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బడి ఈడు పిల్లలను పనిలో పెట్టుకుంటే బాల కార్మిక నిషేధ, నియంత్రణ చట్టం 2016 ప్రకారం మూడు సంవత్సరాల పాటు జైలు శిక్ష లేదా రూ. 20 వేల నుండి 50 వేల వరకు జరిమానా లేదా రెండు విధించవచ్చునని, ఇంటి పనుల కొరకు పిల్లలను నిర్బంధంలో ఉంచడం హక్కుల ఉల్లంఘన అవుతుంది. అంతేగాక వెట్టి చాకిరి నిర్మూలన చట్టం 1976 ప్రకారం కూడా శిక్షార్హులన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పోస్టర్ విడుదల చేశారు. ఇందులో విజన్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ హారిక, రజిత, అనురాధ, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ గంగాధర్, రాజ్ కుమార్, పద్మ, శ్రీదేవి, సుప్రియ, తదితరులు పాల్గొన్నారు.



భైంసాలో రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రామరావ్ పాటిల్

అర్హులకు రేషన్ కార్డులు అందేలా కృషి : ఎమ్మెల్యే పాటిల్

భైంసా, జూలై 30(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలో అర్హులైన ప్రతీ ఒక్కరికి రేషన్‌కార్డు అందేలా కృషి చేస్తానని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక సురలోక్ గార్డెన్స్‌లో భైంసా పట్టణ, మండల పరిధిలోని లబ్దిదారులకు రేషన్‌కార్డుల మంజూరి పత్రాలను అందచేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మట్లాడారు. దశాబ్ద కాలంగా ఎందరో మంది రేషన్‌కార్డుల కోసం నిరీక్షిస్తున్నారని తెలిపారు. రేషన్ కార్డుల మంజూరీ ద్వారా వాందరరి కల నెరవేరుతోందన్నారు. సంబంధిత ప్రక్రియలో ఎలాంటి లోపాలు జరుగకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఇదే క్రమంలో అర్హులందరికీ రేషన్‌కార్డులు అందేలా చూడాలన్నారు. రేషన్ బియ్యం పంపిణీలో కేంద్ర ప్రభుత్వానిదే పెద్దవాట ఉందన్నారు. ఇందులో భైంసా తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, ఎంపీడీవో సుధాకర్ రెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.



కల్లూరు కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న డీపీవో, డీఎల్‌పీవో

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి : డీపీవో

కుంటాల, జూలై 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని డీపీవో శ్రీనివాస్, డీఎల్‌పీవో సుదర్శన్ అన్నారు. బుధవారం మండల కే ంద్రం కుంటాల స్థానిక ఆదర్శ మోడల్ పాఠశాలతో పాటు కల్లూర్ కస్తూర్బా పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి వారు భోజనం చేశారు. ప్రభుత్వ మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎవరైనా మెనూ పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు. అనంతరం మండల కేంద్రం కుంటాల స్థానిక ప్రజాపరిషత్ కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్లు, నూతన రేషన్ కార్డులు, ఓటరు జాబితా సవరణలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ లక్ష్యం మేరకు రేషన్ కార్డులను అందజేయాలని, ఇళ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందేలా చూడాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరిలో అవకతవకలకు తావు లేకుండా చూడాలని, ఓటరు జాబితా సవరణను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వనజ, ఎంపీవో రహీం, ఏపీవో నవీన్‌తో పాటు పలు శాఖల అధికారులు, తదితరులు ఉన్నారు.

అర్హులైన ప్రతీఒక్కరికి రేషన్ కార్డులు

- రేషన్ కార్డుల ప్రక్రియ నిరంతరం
- నూతన రేషన్ కార్డులతో పేదల ఆర్థికాభివృద్ధికి దోహదం
- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

దస్తురాబాద్, జూలై 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అర్హులైన ప్రతిఒక్కరికి నూతన రేషన్ కార్డులు అందజేస్తుందని, నూతన రేషన్ కార్డులు పేద ప్రజలకు ఆర్థికంగా ఎదగడానికి సహకరిస్తాయని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌తో కలిసి లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రేషన్ కార్డు అనేది అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ప్రామాణిక గుర్తింపు అని అన్నారు. నూతన కార్డుల ద్వారా ఇందిరమ్మ ఇళ్లు, రైతు రుణమాఫీ, పింఛన్లు, ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ వంటి పథకాల నుంచి పేదలు లబ్ధి పొందవచ్చని తెలిపారు. మండలానికి 421 నూతన రేషన్ కార్డులు, 928 మెంబర్ యాడింగ్ కార్డులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. గతంలో వివాహితులు, పుట్టిన పిల్లలకు కార్డులు లేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. ఇకపై ఎవరికైనా రేషన్ కార్డు అవసరమైతే ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చని స్పష్టం చేశారు. మంజూరైన కార్డులను ఇంటి వరకు అధికారులే చేర్చుతారని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ.. పేదల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. గత పదేళ్లుగా కొత్త కార్డులు మంజూరు లేక ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి నూతన కార్డులు, ఆరు కిలోల చొప్పున నాణ్యమైన సన్నబియ్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, సీపీవో జీవరత్నం, మండల ప్రత్యేక అధికారి నాగవర్ధన్, పౌర సరఫరాల అధికారి రాజేందర్, తహసీల్దార్ విశ్వంబర్, డిప్యూటీ తహసీల్దార్ యాదవ్ రావు, ఎంపీడీవో రమేష్, అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



లబ్దిదారులకు నూతన రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

అభివృద్ధి, సంక్షేమం కేంద్ర ప్రభుత్వ లక్ష్యం

- నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి
- దిలావర్‌పూర్ మండలంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

దిలావర్‌పూర్, జూలై 30(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమం కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. దిలావర్‌పూర్ మండల కేంద్రంలో బుధవారం మండలంలోని 12 గ్రామ పంచాయతీలకు చెందిన 588 మంది లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులను ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అర్హులందరూ రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని, ఇది నిరంతర ప్రక్రియ అని అన్నారు.

- బీటీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన

మండలంలోని సిర్గాపూర్ ఎక్స్ రోడ్ నుంచి కాల్వ నరసింహ స్వామి ఆలయం వరకు (వయా కాల్వ తండా) రూ. 1.91 కోట్లతో, దిలావర్‌పూర్ తండా నుంచి బన్సపల్లి వరకు రూ.2.56 కోట్లతో నిర్మించనున్న తారు రోడ్ల నిర్మాణ పనులకు, దిలావర్‌పూర్ మండల కేంద్రంలో రూ.20 లక్షలతో నిర్మించనున్న హెల్త్ సబ్ సెంటర్‌కు ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఆర్డీవో రత్న కళ్యాణి, తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్ ఖాన్, డీఎల్‌పీవో అజీజ్ ఖాన్, ఎంపీడీవో అరుణ రాణి, నాయకులు రావుల రాంనాథ్, తాజా మాజీ జడ్పీటీసీ తక్కల రమణ రెడ్డి, డి.ముత్యం రెడ్డి, సత్యం చంద్రకాంత్, బీజేపీ మండల అధ్యక్షులు నర్సారెడ్డి, నాయకులు శైలేశ్వర్, వీరేష్ కుమార్, మెర్వాన్, రమణ, రవి, శంకర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, సాయేందర్, శ్రీను, టికాజీ, శివాజీ, సురేష్, శంకర్, సాగర్, సాయన్న, సీతారామ్‌తో పాటు మండల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

- బాల శక్తి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఏలేటి

సోన్: సోన్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బాల శక్తి కార్యక్రమంలో బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం బాల శక్తి కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బాల శక్తి కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో అనేక అంశాల పట్ల అవగాహన ఏర్పడుతుందని, ఆరోగ్యపరంగా, విద్యాపరంగా చైతన్యవంతులు అవుతారని ఆయన ఈ సందరంగా పేర్కొన్నారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసి ఆస్ట్రానమీ ల్యాబ్‌ను బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డా.రాజేందర్, ఇన్‌చార్జి డీఈవో, లీడ్ బ్యాంక్ మేనేజర్, ఎంఈవో పరమేశ్వర్, మండల అధ్యక్షులు మార గంగారెడ్డి, నాయకులు హరీష్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో పాటు మండల బీజేపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



సిర్గాపూర్, కాల్వ దేవస్థానం బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి



సోన్‌లోని ఉన్నత పాఠశాలలో బాల శక్తి కార్యక్రమంలో భాగంగా ఆస్ట్రానమీ ల్యాబ్‌ను పరిశీలిస్తూ..



బియ్యాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.ఆకాష్

శుభ్రతకు అధిక ప్రాధాన్యం

- డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఆకాష్

భైంసా, జూలై 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అనారోగ్యం బారిన పడకుండా ఉండేందుకు వసతి గృహాల్లో శుచి, శుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.ఆకాష్ సూచించారు. బుధవారం మునిసిపల్ కేంద్రమైన భైంసాలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కేజీబీవీ పాఠశాలల్లో వైద్యాధికారులు, సిబ్బందితో కలిసి తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా రెండు పాఠశాలల్లోని వంటగదులు,వండిన ఆహార పదార్థాలు, నిల్వ కేంద్రంలోని సరుకులు,కూరగాయలు తదితర వాటిని పరిశీలించారు. అనంతరం రెండు పాఠశాల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, వార్డెన్లు, వంట మనుషులతో వేర్వేరుగా సమావేశాలు నిర్వహించి మాట్లాడారు. వర్షాకాలంలో వ్యాధుల ప్రభావం అధికంగా ఉండనున్నందున జాగ్రత్త చర్యలు విధిగా పాటించాలన్నారు. విద్యార్థులకు రుచి,శుచితో కూడిన ఆహర పదార్థాలు అందించాలన్నారు. నాణ్యమైన కూరగాయాలు, సరుకులను మాత్రమే వినియోగించాలన్నారు. వ్యక్తిగత శుభ్రత,పరిసరాల పరిశుభ్రత అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించి ఆరోగ్య జాగ్రత్త చర్యలపై చైతన్యపరచాలన్నారు. ఇందులో భైంసా బస్తీ దవాఖాన వైద్యాధికారి. డా .కమలేష్, సీహెచ్‌వో గంగాధర్, లెప్రసీ అధికారి గంగన్న, హెల్త్ అసిస్టెంట్ నరేష్, తదితరులు పాల్గొన్నారు.